# ఆకాశాన్నంటిన పూల ధరలు

- కనకాంబరాలు కేజీకి రూ. 600
- రైతుల వద్ద తక్కువ ధరకు
- కుమ్మక్కై అమ్ముతున్న వ్యాపారులు
- కొనలేక పోతున్న కొనుగోలుదారులు
- మార్కెట్ అంతా ట్రాఫిక్ మయం

**మెహిదీపట్నం, ఆగస్టు 24,ప్రభాతవార్త:** పూల ధరలు ఆకాశానంటాయి. ఏ పూలను కొందామన్నా ధరలు అందుబాటులో లేక పోవడంతో కొనుగోలుదారులు నిస్సాహాయతను వ్యక్తం చేశారు. నాలుగైదు కేజీలు కొందామనుకున్న కొనుగోలు దారులకు రెండు, మూడు కేజీలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. రైతుల వద్ద నుంచి తక్కువ ధరలకే కొనుగోలు చేసిన వ్యాపారులు కుమ్మకై కొనుగోలు దారులకు మాత్రం ఆమాంతం పెంచి అమ్మారు. వరలక్ష్మివ్రతం పురస్కరించుకొని గురువారం గుడిమల్కాపూర్ పి. ఇంద్రారెడ్డి పూల మార్కెట్‌లో పూల ధరలకు రెక్కలు వచ్చాయి. మామూలు సమయంలో ఏమాత్రం రేటు పలకని బంతి, చామంతి, గులాబీ, టైగర్‌రూబీ, కనకాంబరాలు, మల్లెపూల ధరలు వరలక్ష్మివ్రతం సందర్భంగా మూడింతలు పెరిగాయి. దీంతో పూల ధరలను విన్న కొనుగోలుదారులు చేసేదేమి లేక రెండు, మూడుకేజీల పూలను కొనుగోలు చేశారు.

**ఇతర రాష్ట్రాల నుంచి**

**గుడిమల్కాపూర్ మార్కెట్‌కు పూలు...**

గుడిమల్కాపూర్ పి.ఇంద్రారెడ్డి పూల మార్కెట్‌కు తెలంగాణ ప్రాంతంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి సైతం పూలు వచ్చాయి. గులాబీలు మహేశ్వరం, చేవేళ్ళ, మోయినాబాద్, శంషాబాద్ ప్రాంతాల నుంచి రాగా టైగర్‌రూబి బెంగ్లూర్, కర్ణాటక ప్రాంతాల నుంచి, కనకాంబరాలు ఆంధ్రప్రదేశ్, బంతి మహరాష్ట్ర, చామంతి తమిళనాడు, బెంగళూరు రాష్ట్రాల నుంచి వచ్చాయి.

**పూల మొత్తం 43,170 కిలోలు**

బంతి - 220కిలోలు, చామంతి - 25,920 కిలోలు, మల్లెలు -2760కిలోలు, కనకాంబరాలు - 410 కిలోలు, టైగర్‌రూబీ - 8980 కిలోలు, గులాబీలు - 4880 కిలోల పూలు వచ్చాయని మార్కెట్ అధికారులు తెలిపారు.

**కొనుగోలుదారులతో కిటకిటలాడిన మార్కెట్**

గుడిమల్కాపూర్ పి.ఇంద్రారెడ్డి పూల మార్కెట్ వ్యాపారులు,కొనుగోలుదారులతో కిటకిటలాడింది. అడుగుతీసి అడుగువేయలేని పరిస్థితి నెలకొనడంతో కొనుగోలుదారులు అనేక అవస్థలు పడ్డారు. మార్కెట్‌నిండా వాహనాలు నిండిపోవడంతో మార్కెట్ తో పాటు గుడిమల్కాపూర్ మార్కెట్ రహదారి ట్రాఫిక్‌మయంగా మారింది. మార్కెట్‌లోని పార్కింగ్ స్థలంతోపాటు వ్యాపార సముదాయల వద్ద క్రయవిక్రయాలు జరగడంతో కొను గోలు దారులు ఇబ్బందులు పడ్డారు. మార్కెట్‌లోకి రావడానికి సైతం ఇబ్బందులు ఎదురవుతుండడం తో రోడ్లపై ఉన్నటువంటి పూలను కొనుగోలు చేశారు.

**పూల ధరలు...**

కనకాంబరాలు కేజీ రూ. 1 వేయి
మల్లెపూలు -రూ.400.
చామంతి -రూ.250.
టైగర్‌రూబీ -రూ.250.
గులాబీ -రూ.200.
బంతి -రూ.80









హైదరాబాద్ వార్త

# 'గ్రేటర్'పై బిజెపి నజర్

- గెలుపు గుర్రాలపై అగ్రనేతల ఆరా
- ఒక్కో సీటుకు ముగ్గురు నుంచి నలుగురు పోటీ
- అంగబలం,అర్థబలం ఉన్నవారికే చాన్స్

**హైదరాబాద్, ఆగస్టు 24 ప్రభాతవార్త**

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటి బిఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం తామేనని నిరూపించుకునేందుకు కమలనాథులు వ్యూహరచన మొదలు పెట్టారు. ఇప్పటికే బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించడం, అదే దిశలో కాంగ్రెస్ పార్టీ గాంధీ భవన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న నేపథ్యంలో బిజెపి కూడా గెలుపు గుర్రాలపై ఆపార్టీ ఆరాతీస్తున్నారు. గత పార్లమెంటు ఎన్నికల్లో అనూహ్యంగా నాలుగు స్థానాలను గెలిచిన బిజెపి రాష్ట్రంలో కూడా అధికారం దిశగా అడుగులు వేయాలని పార్టీ శ్రేణులకు సంకేతాలు పంపించింది. ఈ నేపథ్యంలోనే బిజెపి నాయకులు దూకుడు పెంచి బిఆర్ఎస్ ప్రభుత్వం మీద విమర్శలు తీవ్రతరం చేశారు. తాజాగా మరికొన్ని నెలల్లోనే అసెంబ్లీకి ఎన్నికలు రాబోతున్న నేపథ్యంలో ఉన్న తక్కువ వ్యవధిలోనే అభ్యర్థుల ఎంపిక, విజయావకాశాలు, తెలంగాణలో ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీగా నిరూపించుకునే లక్ష్యాలతో సిద్ధమవుతోంది. ఇప్పటికే కేంద్రానికి చెందిన ఇంటెలిజెన్స్ విభాగాల ద్వారా పార్టీ విజయావకాశాలపై నివేదికలు పొందిన బిజెపి, అందులోని అంశాలను క్రోడీకరించుకొని ముందుకు వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో అధికారం దక్కించుకునేందుకు పావులు కదుపుతున్న బిజెపి గ్రేటర్‌పై నజర్ పెట్టింది. అయితే నగరంలో వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను ఎంపిక చేయడం పార్టీకి పెద్ద కసరత్తే అని చెప్పొచ్చు. ఇక్కడ సీనియర్, అగ్రనాయకులు పోటీ చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. మెజార్టీ డివిజన్లలో విజయం సాధించిన బిజెపి కార్పొరేటర్లలో అనేక మంది ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. ఒక్కో నియోజకవర్గం నుంచి ముగ్గురు నుంచి నలుగురు టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే అర్థబలం, అంగబలంతో పాటు స్థానికంగా బాగా పలుకుబడి, గుర్తింపు ఉన్న వారినే పార్టీ ఎంపిక చేస్తుందని సీనియర్ నాయకుడు ఒక్కరు పేర్కొంటున్నారు.2014 ఎన్నికల్లో అంబర్‌పేట, ముషీరాబాద్, ఖైరతాబాద్, గోషామహల్, ఉప్పల్ నియోజకవర్గాల్లో పార్టీ విజయం సాధించగా, 2018 ఎన్నికల్లో ఒకే ఒక్క స్థానంతో సరిపెట్టుకుంది. 2020లో జరిగిన బల్దియా ఎన్నికల్లో ఏకంగా 48 డివిజన్లను కైవసం చేసుకొని సత్తా చాటింది. పైగా సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి జి.కిషన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించడమే కాకుండా ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడుగా, కేంద్ర క్యాబినెట్ మంత్రిగా కొనసాగుతుండడం.. వచ్చే ఎన్నికల్లో గ్రేటర్ నుంచి అత్యధికంగా ఎమ్మెల్యే సీట్లు గెలువాలనే లక్ష్యంతో అగ్రనేతలు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

అంబర్‌పేట నియోజకవర్గంలో కిషన్‌రెడ్డి సతీమణి కావ్యారెడ్డిని రంగంలోకి దింపే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే ఇక్కడి నుండి ఓ కార్పొరేటర్ భర్త తనకే టికెట్ అంటూ వ్యూహత్మకంగా ప్రచారం చేసుకుంటున్నట్లు సమాచారం. ఇక్కడ నుండి సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్ రావును బరిలో నిలిపే అవకాశాలు లేకపోలేదు. ఆయనకు అర్థబలం, అంగబలం ఉండడం ఆయనకు కలిసివచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఈ నియోజకవర్గానికి చెందినవారు కావడంతోపాటు అయన గతంలో ఇక్కడి నుండి మూడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆయన సొంత సెగ్మెంట్ కావడంతో ఆయన నిర్ణయంపై అభ్యర్థి ఎంపిక ఆదారపడి ఉంటుంది. గోషామహల్‌లో బిజెపి నుంచి గెలిచిన రాజాసింగ్ ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్నారు. త్వరలో పార్టీ అధిష్టానం తనపై సస్పెన్షన్ ఎత్తివేసి టికెట్ ఇస్తుందన్న ఆశతో ఆయన ఉన్నారు. ఓ కార్పొరేటర్ కూడా తనకు టికెట్ కేటాయించాలని పార్టీని కోరుతున్నారు. ముషీరాబాద్ నుంచి ఒక అగ్రనాయకుడితోపాటు గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి కూడా బరిలోకి దిగే అవకాశాలు ఉన్నాయి. ఉప్పల్, ఖైరతాబాద్, మల్కాజిగిరి నియోజకవర్గాల్లో అగ్రనాయకులు ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్, చింతల రామచంద్రారెడ్డి, రామచంద్రరావు పోటీలోకి దిగేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఇక సికింద్రాబాద్ నియోజకవర్గంలో సీనియర్ నాయకుల మధ్య పోటీ ఎక్కువగా ఉంది. అయితే ఇక్కడ ఇటీవల పార్టీలో చేరిన ప్రముఖ సీనియర్ నటి జయసుధలను రంగంలో దింపే అవకాశాలు కనిపిస్తున్నాయి. కంటోన్మెంట్‌లో కూడా ఇదే పరిస్థితి ఉంది. ఎల్బీనగర్ నియోజకవర్గంలో 11 డివిజన్లలో పదిచోట్ల బిజెపి కార్పొరేటర్లు గెలిచారు. ఇక్కడి నుంచి ఇద్దరు కార్పొరేటర్లతో పాటు మరో ఇద్దరు సీనియర్ నాయకులు ఎమ్మెల్యే టికెట్‌పై ఆశలు పెట్టుకున్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో ఇద్దరు కార్పొరేటర్లు గెలవగా, ఒక కార్పొరేటర్‌తో పాటు మరో ఇద్దరు సీనియర్ నాయకులు బరిలో దిగడానికి ప్రయత్నిస్తున్నారు. మలక్‌పేట నియోజకవర్గంలతో కార్పొరేటర్ల భర్తలు పోటీ చేయడానికి ముందుకు వస్తున్నారు. వీరితో పాటు నియోజకవర్గానికి చెందిన మరో ఇద్దరు నేతలు ఆసక్తి చూపుతున్నారు. కుత్బుల్లాపూర్ నుంచి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ పేరును ఖరారు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. సనత్‌నగర్ నుంచి మర్రి శశిధర్‌రెడ్డితో పాటు జూబ్లీహిల్స్, శేరిలింగంపల్లి నుంచి పోటీ చేయడానికి ఆపార్టీ కార్పొరేటర్ల భర్తలతోపాటు అర్థబలం, అంగబలం పుష్కలంగా ఉన్ననేతలు కూడా ముందుకు వస్తుండడం గమనార్హం.

# నేడు నగరానికి రానున్న మైనంపల్లి

**రేపు కార్పొరేటర్లు, అనుచరులతో భేటీ.. సమావేశం అనంతరం నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం**



**హైదరాబాద్, ఆగస్టు 24,ప్రభాతవార్త:**

ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను కేటాయించినప్పటి నుంచి మల్కాజ్‌గిరి ప్రజల్లో ఉత్కంఠ పరిస్థితులు నెలకొన్నాయి.స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తనయుడు రోహిత్‌బాబుకు మెదక్ నియోజకవర్గం నుంచి బిఆర్ఎస్ టికెట్ ఇవ్వకపోవడంతో మంత్రి హరీష్‌రావుపై విచక్షణారహితంగా వ్యాఖ్యలు చేయడంతో అదిష్టానం ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో గత ఐదురోజుల క్రితం కుటుంబంతో మైనంపల్లి తిరుపతి వెళ్లారు. దీంతో నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో ఆయన అనుచరులు, కార్పొరేటర్లు, నాయకులు అయోమయంలో పడ్డారు. బిఆర్ఎస్ పార్టీని వదిలి కాంగ్రెస్ పార్టీ నుంచి మెదక్, మేడ్చల్, మల్కాజ్‌గిరి నియోజకవర్గాలలో పోటీచేసేందుకు రేవంత్‌రెడ్డితో మంతనాలు జరిపినట్లు పలువురు నియోజకవర్గ ప్రజలు గుసగుసలాడుతున్నారు. ఇదే విషయంపై ఈనెల 26న నియోజకవర్గంలోని కార్పొరేటర్లు, నాయకులు,కార్యకర్తలు వివిధ కమిటీల సభ్యులతో ఉదయం 10 గంటలకు ఆయన నివాసంలో సమావేశం కానున్నారు. సమావేశంలో బిఆర్ఎస్‌లో కొనసాగాలా వద్దా అనేదానిపై చర్చించనున్నట్లు తెలుస్తుంది. రాష్ట్రంలోనే ఎదురులేనిశక్తిగా ప్రజల మనస్సు గెలిచిన మైనంపల్లి తొందరపడకుండా ఉండాల్సిందని ఆయన అభిమానులు, నియోజకవర్గ ప్రజలు పేర్కొంటున్నారు. ఏదీఏమైనప్పటికీ తనకొడుకు టికెట్ కోసం తన రాజకీయ భవిష్యత్‌ని తూకం లో పెట్టాడని పలువురు మేధావులు పేర్కొంటున్నారు.



మంత్రి గంగుల కమలాకర్‌ను సన్మానిస్తున్న ఎఫ్‌సిఐ మెంబర్లు సురేందర్‌గౌడ్, రిజ్వాన్ తదితరులు

## మంత్రి గంగులతో ఎఫ్‌సిఐ సభ్యుల బేటీ

**కంటోన్మెంట్, ఆగస్టు 24 ప్రభాతవార్త:** రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను గురువారం భారత పౌర ససరఫరాల కమిటీ సభ్యులు బేటీ అయా ్యరు. ఆహర ధాన్యాల సరఫరాకు పలు విషయాలపై ఆయనపై చర్చించారు. ఆహార ధాన్యాలను వినియోగదారులకు సకాలంలో అందించాలన్నారు. నాణ్యమైన ధాన్యాలను వినియోగదారులకు సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్.సి.ఐ. కమిటీ సభ్యులు తిరుపతి సురేందర్ గౌడ్, మహ్మద్ రిజ్వాన్, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ నాయకత్వంలో

## ఆర్థికంగా బలపడుతున్న 'దేశం'

**కర్ణాటక ఎమ్మెల్యే గురురాజ్ శెట్టి**

**బేగంపేట ఆగస్టు 24,ప్రభాతవార్త :** కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఆర్థికంగా ఎంతో బలపడుతుందని, కర్నాటక ఎమ్మెల్యే గురురాజ్ శెట్టి అన్నారు. గురువారం ఎమ్మెల్యే ప్రవాస్ కార్యక్రమానికి జిల్లా పదాతి కారులు,డివిజన్ ముఖ్య నాయకులు కార్యకర్తలు హాజరయ్యారు.ఈ సందర్భంగా గురురాజ్ శెట్టి మాట్లాడుతూ కేంద్రం లోని మోదీ ప్రభుత్వం.పేద,బడుగు,బలహీన వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో భాజపా ను అధికారంలోకి తీసుకు వచ్చేందుకు బూత్ స్థాయి నుంచి కార్యకర్తలు కృషి చేయాల్సి ఉందని ఆయన పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బూర్గుల శ్యాంసుందర్ గౌడ్, రాంగోపాల్‌పేట కార్పొరేటర్ చీరె సుచిత్ర, సనత్‌నగర్ నియోజకవర్గం బీజేపీ నాయకులు చీరె సత్యనారాయణ (శ్రీకాంత్), ఆకుల ప్రతాప్,వజనాల దయానంద్‌రావు, పాల్గొన్నారు.



ఛలోఢిల్లీ కరపత్రం ఆవిష్కరిస్తున్న శివకుమార్, కమలేష్‌మహారాజ్

## గోవు జాతీయ ప్రాణిగా ప్రకటించాలి

**27 జంతర్ మంతర్ వద్ద భారీ ధర్నా**

**హైదరాబాద్, ఆగస్టు 24,ప్రభాతవార్త:**

గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద భారీ ధర్నా నిర్వహించనున్నట్లు యుగతులసిఫౌండేషన్ చైర్మన్ కొలిశెట్టి శివకుమార్, సర్వ్ దలియూ గోరక్ష మంచ్ అధ్యక్షులు కమలేష్ మహారాజ్, జైపాల్‌సింగ్ తదితరులు తెలిపారు. ఈమేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గోమాతను రక్షించడంలో పూర్తిగా విఫలమయ్యా యన్నారు. రాబోయే ఎలక్షన్లను గో అభిమానులు బహిష్కరించాలన్నారు. మూడుకోట్లమంది ఓట్లు వేయకపోతే సనాతన ధర్మం అంటే ఏమిటో వారికి అర్థమవుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు గోరక్ష మంచ్, లవ్‌కౌ ప్రతినిధులు పాల్గొన్నారు.

### మంత్రి మహేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన మహేందర్‌గౌడ్

**నార్సింగి, ఆగస్టు 24 ప్రభాతవార్త :**

రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన పట్నం మహేందర్‌రెడ్డికి బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో రెండోమారు మహేందర్‌రెడ్డి మంత్రి పదవిని చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో, పార్టీ పటిష్టతలో మహేందర్‌రెడ్డి అందిస్తున్న సేవలను గుర్తించి సీఎం మంత్రిగా అవకాశం కల్పించారన్నారు. మహేందర్‌రెడ్డి నుంచి రంగారెడ్డి జిల్లాలోని చాలా మంది నాయకులు స్ఫూర్తి పొంది, రాజకీయంలో రాణిస్తున్నారని మహేందర్‌గౌడ్ తెలిపారు. మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో బిఆర్ఎస్ నేత వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# బిసిబంధు నిరంతర ప్రక్రియ : మంత్రి తలసాని

**ఫిల్మ్‌నగర్, ఆగస్ట్ 24, ప్రభాతవార్త**



లబ్ధిదారులకు చెక్కును పంపిణీ చేస్తున్న మంత్రి తలసాని, ఎమ్మెల్యే దానం, మేయర్ విజయలక్ష్మీ

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తొమ్మిదిన్నర సంవత్సరాలలో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. గురువారం బంజారహిల్స్‌లోని బంజారా భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని బిసి కులవృత్తి దారులకు ప్రభుత్వం మంజూరు చేసిన లక్ష రూపాయలు చొప్పున ఆర్థిక సహాయం చెక్కులను స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మీతో కలిసి 300మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేస్తున్నామని చెప్పారు. కులవృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారికి అండగా నిలవాలని, వారి అభివృద్ధికి చేయూతను అందించాలనే సదుద్దేశంతో ప్రభుత్వం లక్షరూపాయల చొప్పన ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలని ప్రభుత్వం కోరుకుంటుందని అన్నారు. దేశంలోనే అత్యధిక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రం నిలిచిందన్నారు. అభివృద్ధి కార్యక్రమాల విషయంలోకూడా ఎంతో ముందున్నదని చెప్పారు. నగరంలో రోడ్ల అభివృద్ధి, డ్రైనేజి, వాటర్ సమస్యల పరిష్కారం, పార్కుల అభివృద్ధి, గ్రేవ్ యార్డ్‌ల అభివృద్ధి వంటి అనేక కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందని వివరించారు. ఎన్నో సంవత్సరాల నుండి పేద ప్రజలు నివసిస్తున్న స్థలాన్ని జీఓ 58తీసుకొచ్చి వారికే సొంతం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. పేదింట ఆడపడుచు పెళ్ళికి ఒక లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందిస్తున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనని అన్నారు. పుట్టబోయే బిడ్డ నుండి మనిషి చివరి అంకం వరకు బాగోగులను ఆలోచించే గొప్ప మనసున్న నాయకుడు ముఖ్యమంత్రి కెసిఆర్ అని తెలిపారు. పేద ప్రజల సొంత ఇంటి కలను నెరవేర్చాలని, వారు గొప్పగా బ్రతకాలనే లక్ష్యంతోనే దేశంలో ఎక్కడాలేని విధంగా అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్ రూమ్ ఇల్లను ప్రభుత్వం నిరి ్మంచి ఉచితంగా అందజేస్తున్నట్లు వివరించారు. దేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో కూడా డబుల్ బెడ్ రూమ్ ఇల్ల నిర్మాణ కార్యక్రమం లేదని అన్నారు. ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుంటే బిజెపి, కాంగ్రెస్ నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఈ ప్రాంత ప్రజా ఓట్లతో గెలిచి కేంద్రమంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి గడిచిన నాలుగన్నర సంవత్సరాలలో ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ గత ఐదేళ్లలో ఖైరతాబాద్ నియోజకవర్గంలో సిఎం కెసిఆర్ నేతృత్వంలో నందనవనంగా తీర్చిదిద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర గ్రంధాలయ సంస్థ చైర్మన్ ప్రసన్న, కార్పొరేటర్ వనం సంగీత, ఆర్.డి.ఓ రవి, బిసి కార్పొరేషన్ జిల్లా అధికారి ఆశన్న, ప్రత్యేక అధికారి చరితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కులవృత్తిపై ఆధారపడినవారికి రూ. లక్ష ఆర్థిక సహాయం

**మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్**

**బేగంపేట ఆగస్టు 24,ప్రభాతవార్త**



కుల వృత్తి దారులకు చెక్కులు అందిస్తున్న మంత్రి తలసాని

కంటోన్మెంట్ నియోజకవర్గ ప్రజల తాగునీటి ఇబ్బందులను తొలగించేందుకు దివంగత ఎమ్మెల్యే సాయన్న ఎంతో కృషి చేసారని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గురువారం బోయిన్‌పల్లి రోడ్డులోని లీప్యాలెస్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలోని అర్హులైన 300 మంది బీసీ కుల వృత్తి దారులకు ప్రభుత్వం మంజూరు చేసిన లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయం చెక్కులను మంత్రి తలసాని పంపిణీ చేసారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ కంటోన్మెంట్ పరిధిలో 10, 15రోజులకోసారి నీటి సరఫరా జరిగేది, దీంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడేవారని అన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రజల మాదిరిగానే కంటోన్మెంట్ ప్రజలకూ సక్రమంగా నీటి సరఫరా జరిగితే సమస్య పరిష్కారం అవుతుందని భావించిన సాయన్న ముఖ్యమంత్రి, మున్సిపల్ శాఖ మంత్రిపై ఒత్తిడి తీసుకొచ్చి సాధించారని అన్నారు. కులవృత్తిపై ఆధారపడిన వారికి అండగా ఉండాలనే ఆలోచనతోనే ప్రభుత్వం లక్ష రూపాయలు చొప్పున ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని చెప్పారు.ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేస్తామని తెలిపారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు నాయకత్వంలో అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని తెలిపారు. దళితుల అభివృద్ధి కోసం దళితబంధు, పేదల ఇంటి నిర్మాణం కోసం గృహలక్ష్మి పథకం కింద 3 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న విషయాన్ని గుర్తు చేసారు.దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 77 సంవత్సరాలలో ఏ ప్రభుత్వం చేయని కార్యక్రమాలను గడచిన తొమ్మిదిన్నర సంవత్సరాలలో రాష్ట్ర ప్రభుత్వం చేసిందని చెప్పారు. కంటోన్మెంట్ ప్రజల కోసం 1200 పడకల మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం జరుగుతుందని, చెప్పారు. ప్రజల అభివృద్ధి కోసం పాటుపడుతున్న ప్రజలకు మేలు చేస్తున్న ప్రభుత్వానికి అండగా నిలవాలని అన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికలలో కంటోన్మెంట్ నియోజకవర్గం నుండి సాయన్న కుమార్తె లాస్య నందితను ఆశీర్వదించి గెలిపించాలన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలను పూర్తిస్థాయిలో అందిస్తామని మంత్రి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బెవరేజెస్ కార్పొరేషన్ ఛైర్మన్ గజ్జెల నాగేష్, ఆర్డీవో రవి, బీసీ కార్పొరేషన్ జిల్లా అధికారి ఆశన్న, ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత,నియోజకవర్గ ఇంచార్జి మర్రి రాజశేఖరరెడ్డి, బోయిన్‌పల్లి మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ టీఎన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సికింద్రాబాద్ సెయింట్ మెరీస్ సెంటినరీ విద్యార్థులు చంద్రయాన్ 3 విజయవంతం అయిన సందర్భంగా ర్యాలీ నిర్వహించిన దృశ్యం

## డిప్యూటీ స్పీకర్ క్యాంపు ఆఫీస్ వద్ద బిజెపి ఆందోళన



పద్మారావు గౌడ్ క్యాంపు ఆఫీస్ వద్ద బైఠాయించిన బీజేపీ నేతలు

**సికింద్రాబాద్, ఆగస్టు 24 ప్రభాతవార్త :** సికింద్రాబాద్ నియోజకవర్గంలో పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నియోజకవర్గం బీజేపీనేతలు, కార్యాకర్తలు సీతాఫల్‌మండిలోని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ క్యాంపు కార్యాలయం వద్ద ఆందోళన జరిపారు. కార్యాలయానికి గేటు వేసి ఉండడంలో వెలుపలే బైటాయించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు వెంటనే ఇవ్వాలని నినాదాలు చేశారు. చిలకలగూడ పోలీసులు అడ్డుకొని బీజేపీ నేతలు, కార్యాకర్తలను పంపించివేశారు. కొందరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కార్యాక్రమంలో మహంకాళి జిల్లా ప్రధానకార్యాదర్శి మేకల సారంగపాణి, ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి, మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి, బండపల్లి సతీష్, రాజేశ్వరి, కీర్తి, ప్రభుగుప్త ఇతర నేతలు పాల్గొన్నారు.

## ఆధునిక జీవనంలో పెరుగుతున్న మానసిక రుగ్మతలు

**సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ**

**హైదరాబాద్, ఆగస్టు 24,ప్రభాతవార్త:** ఆధునిక జీవనశైలిలో మానసిక రుగ్మతలు పెరుగుతున్నాయని ఉద్యోగాలు, చదువులలో నానాటికి పెరుగుతున్న ఒత్తిడి కారణంగా చాలామంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ ఐఎఎస్ అధికారి జెడి లక్ష్మీనారాయణ అన్నారు. ఈమేరకు గురువారం అమీర్‌పేట్‌లో ఆస్ట్రర్‌ప్రైమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్‌కేర్ పేరుతో ఏర్పాటు చేసిన ప్రత్యేక క్లినిక్‌ను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ పెరుగుతున్న మానసిక ఒత్తిడితో అనేక రుగ్మతలు చోటు చేసుకుంటున్నాయని దురదృష్టవశాత్తు వాటిని ఎదుర్కోలేక కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే వీరందరికీ సరైన సమయంలో నిపుణులైన మానసిక వైద్యుల ద్వారా చికిత్స, కౌన్సిలింగ్ అందజేసినటల్లయితే నివారించవచ్చునని చెప్పారు. అంతేకాకుండా మద్యం,డ్రగ్స్‌లాంటి అలవాటల్ల కారణంగా ఎందరో సాధరణ జీవితాన్ని గడపలేని స్థితికి వస్తున్నారని వారిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సూచించారు. కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ వైద్యులు డా.జాన్సే థామస్, డా.నిథిన్ కొండాపురం, డా.శివ అనూప్, సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న జెడి లక్ష్మీనారాయణ, తదితరులు



స్థానికులతో కలిసి పాదయాత్ర నిర్వహిస్తున్న రాజేశ్వరరావు

## కూకట్‌పల్లిలో 52వ రోజుకు చేరిన బిజెపి పాదయాత్ర

**కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్ట్ 24, ప్రభాతవార్త :** ఇంటింటికీ బిజెపి భరోసా పేరిట 52వ రోజు పాదయాత్రను ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వద్దేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం ఫతేనగర్ డివిజన్ గౌతంనగర్‌లో ప్రారంభించారు. గడపగడపకు తిరుగుతూ కేంద్రప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈసారి కూకట్‌పల్లి నియోజకవర్గంలో బిజెపి జెండాను ఎగరవేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపి కార్యవర్గ సభ్యులు అర్సనపల్లి సూర్యారావు, డివిజన్ అధ్యక్షులు ఉదయ్ కుమార్, రాష్ట్ర ఓబిసి మోర్చా కార్యవర్గ సభ్యులు బురుగుపల్లి రామ్మోహన్, ఓబిసి మోర్చా కో కన్వీనర్ సతీష్‌గౌడ్, అస్లాం, సాయి, ప్రమోద్, నీతూసింగ్, ఉషరాణి, భనేశ్, నరేష్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ముందుంటా: కార్పొరేటర్



డివిజన్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

**కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్ట్ 24, ప్రభాతవార్త :** ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో సమస్యల పరిష్కారం కోసం ముందుంటానని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం ఆయన డివిజన్‌లోని సమస్యలపై పాదయాత్ర నిర్వహించారు. సాయినగర్ ఈస్ట్, వెస్ట్, రాఘవేంద్రనగర్, ఆదిత్యనగర్ కాలనీలలో స్థానికులతో కలిసి కార్పొరేటర్ పాదయాత్ర చేస్తూ ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో అభివృద్ధి పనులను తొంభైశాతం పూర్తయ్యాయన్నారు. సాయినగర్‌లో కరెంట్ స్తంభం ఒకటి ఒరిగి ప్రమాదకరంగా ఉందని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణమే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే సాయినగర్,రాఘవేంద్రనగర్, ఆదిత్యనగర్‌కాలనీలలో ఉన్న డ్రైనేజీ, సీసీరోడ్ల పనులను వెంటనే పూర్తిచేస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి పనులు, అందించిన సంక్షేమ పథకాలను ముద్రించిన కరపత్రాలను ఇంటింటికి అందించారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, రాజేష్‌చంద్ర, కాశినాథ్‌యాదవ్, చిన్నోళ్ళ శ్రీనివాస్, జి.శ్రీనివాస్, శివరాజ్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

**సికింద్రాబాద్, ఆగస్టు 24 ప్రభాతవార్త :** పేదలకు సంక్షేమ పథకాలు లభించేలా కృషి చేస్తున్నామని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ తెలిపారు. సికింద్రాబాద్ నియోజకవర్గపరిధిలో వివిధ మున్సిపల్ డివిజన్‌లకు సంబంధించిన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పద్మారావు గౌడ్ గురువారం సీతాఫల్‌మండిలోని క్యాంపు కార్యాలయంలో రూ. 45 లక్షల విలువచేసే 31 చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఇంటికి వివిధ సంక్షేమ పథకాలను అందించగలిగామన్నారు. కార్పొరేటర్‌లు సామలహేమ, సునీత, శైలజ, నేతలు కరాటేరాజు పాల్గొన్నారు.

## రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



రోడ్డు పనికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు

**హైదరాబాద్, ఆగస్టు 24 ప్రభాతవార్త:** నల్లకుంటడివిజన్‌లోని శివానంద్ నగరలో రూ. 39 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులను గురువారం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతతో రోడ్డు పనిని త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు,కార్యర్తలు,అధికారులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్యయోధులకు స్వరాంజలితో నివాళులు అమోఘం

### డా. సముద్రాల వేణుగోపాలాచారి

**రవీంద్రభారతి, ఆగస్టు 24 ప్రభాతవార్త :** ఒకపక్క దేశభక్తిని పురిగొల్పుతూ మరోపక్క దేశానికి స్వాతంత్ర్యాన్ని తెచ్చిన యోధులకు స్వరాంజలితో నివాళులర్పించడం అమోఘమని తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ డా. సముద్రాల వేణుగోపాలాచారి అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ, ప్రాజ్ఞిక ఫౌండేషన్, సీల్‌వెల్ కార్పొరేషన్, గంగోత్రి స్వరవాహిని సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో వివిధరంగాల్లో విశేషసేవలందిస్తున్న పలువురు ప్రముఖులకు సీల్‌వెల్ ఎక్సలెన్సీ అవార్డుల ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వేణుగోపాలాచారి విశిష్ట అతిథులు సీల్‌వెల్ సీఎండి బండారు సుబ్బారావు, దైవజ్ఞశర్మ, మోహన్, గౌరవ అతిథులు కె.గీతామూర్తి, ప్రాజ్ఞిక అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రవీణ్, పారిజాత, ఎన్.పురుషోత్తంగౌడ్ తదితరులతో కలిసి ఆయా రంగాల్లో విశేష సేవలందిస్తూ అద్భుతంగా రాణిస్తున్న ప్రతిభావంతులు డా. పాములపర్తి రామారావు, డా. ఎస్.జె.రహమాన్, డా. ఎం.ఎం.హుస్సేని (ముజీబ్), గొర్తి చంద్రశేఖర్‌లను ఘనంగా సత్కరించి సీల్‌వెల్ ఎక్సలెన్సీ అవార్డులను ప్రదానంచేసి వారి సేవలను కొనియాడుతూ మున్ముందు సమాజానికి మరింతగా సేవలందించాలని కోరారు. సభకుముందు గాయకుడు ప్రవీణ్ నేతృత్వంలో వర్ధమాన గాయనీగాయకుల గళం నుండి ఆణిముత్యాల్లాంటి పాటలు ఆహుతులను తన్మయుల్నిచేసి మంత్రముగ్ధులను కావించాయి.



సీల్‌వెల్ ఎక్సలెన్సీ అవార్డులను ప్రదానంచేస్తున్న వేణుగోపాలాచారి

# బిఆర్ఎస్ పార్టీపై బిసిలు తిరుగుబాటు చేయాలి

## అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టిన బిసిలు

**సైఫాబాద్, ఆగస్టు 24 ప్రభాతవార్త:** అసెంబ్లీ ఎన్నికల్లో బిసిలకు అతి తక్కువగా సీట్లు కేటాయించిన బిఆర్ఎస్ పార్టీపై తిరుగుబాటు చేయాలని బిసి కులాల జెఎసి ఛైర్మన్ కుందారం గణేషచారి, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ బిసిలకు పిలుపునిచ్చారు. 60 శాతం జనాభాఉన్న బిసిలకు 23 సీట్లు, అర శాతం జనాభా ఉన్న వెలమలకు 12 సీట్లు, ఐదు శాతం కూడా లేని అగ్రవర్ణాలకు 60 సీట్లు కేటాయించి బిసిలకు తీరని అన్యాయం చేసిన బిఆర్ఎస్ పార్టీని వచ్చే ఎన్నికల్లో బొందపెడతామని వారు హెచ్చరించారు. బిఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ సీట్ల కేటాయింపులో చేసిన అన్యాయానికి వ్యతిరేకంగా బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఇచ్చిన పిలుపుమేరకు గురువారం ట్యాంక్‌బండ్ వద్ద గల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట అనేక మంది బిసిలు నల్లజెండాలతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా గణేష్‌చారి, శ్రీనివాస్ మాట్లాడుతూ బిసిలకు అతి తక్కువగా సీట్లు కేటాయించిన బిఆర్ఎస్ పార్టీ 60 శాతం జనాభా ఉన్న బిసిలకు 23 సీట్లు కేటాయించి అవమానించిందని, సామాజిక న్యాయం లేదని, ఇది బిసిల ద్రోహుల పార్టీఅని ధ్వజమెత్తారు. పథకాలు అణగారిని వర్గాలకు, పదవులు అగ్రవర్ణాలకా? అని వారు ప్రశ్నించారు. బిసిలలో 136 కులాల ఉంటే కేవలం 5 కులాలకు సీట్లు ఇచ్చి 131 కులాలను విస్మరించడం దారుణమన్నారు. బిసిల జనాభా ప్రాతిపదికన 60 శాతం సీట్లు కేటాయించాలని, మేము ఎంతో మాకు అంత వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో అగ్రవర్ణాలకు కేటాయించిన 60 సీట్ల అభ్యర్థులను చిత్తుగా ఓడిస్తామని వారు హెచ్చరించారు. ఈ నిరసన ప్రదర్శన బిసి నేతలు తాటికొండ విక్రమ్‌గౌడ్, కనకాల శ్యాం, గూడూరు భాస్కర్, గొడుగు మహేష్, సదానందం, నర్సింహ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న బిసిలు



కంటోన్మెంట్ బిఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందితను అభినందిస్తున్న మార్కెట్ డైరెక్టర్ నారాయణ తదితరులు

## లాస్య నందితకు అభినందనలు తెలిపిన మార్కెట్ డైరెక్టర్

**కంటోన్మెంట్, ఆగస్టు 24 ప్రభాతవార్త :** కంటోన్మెంట్ నియోజకవర్గం బిఆర్ఎస్ అభ్యర్థిగా దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురు లాస్య నందితకు టికెట్ ఖరారుచేయడంతో బోయిన్‌పల్లి మార్కెట్ డైరెక్టరు బత్తుల నారాయణ, భాస్కర్ ముదిరాజ్‌లు గురువారం లాస్యను మర్యాదపూర్వకంగా పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలియజేశారు. వచ్చే ఎన్నికల్లో లాస్య నందితను బారీ మెజార్టీతో గెలిపించేందుకు శాయశక్తుల కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సదానంద్ గౌడ్, మురళీ యాదవ్, ఎస్.రాము తదితరులు పాల్గొన్నారు.

### లాస్యకు మదతు తెలిపిన సుబ్రమణ్య స్వామి దేవాలయ కమిటీ

కంటోన్మెంట్ బిఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందిత విజయానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని సుబ్రమణ్యస్వామి దేవాలయం ధర్మకర్తలు చొల్లేటి రమేష్, బిఆర్ఎస్ నేతలు కిరణ్, ఉమా శంకర్, మురళీ యాదవ్, శ్రీను, నిత్యానంద్ తెలిపారు.

## పేదలకు వరం సిఎంఆర్‌ఎఫ్: ఎమ్మెల్యే వివేకానంద్

**పేట్‌బషీరాబాద్, ఆగస్టు 24 ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధికి చెందిన 78మంది సిఎంఆర్‌ఎఫ్ పథకం లబ్దిదారులకు రూ.48,70,500 విలువ గల చెక్కులను చింతల్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వివేకానంద్ అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పథకాలు అమలు చేస్తోందన్నారు. అనారోగ్యాలతో ఆసుపత్రుల పాలైన నిరుపేదలకు సిఎంఆర్‌ఎఫ్ వరంలా మారిందన్నారు. తమ ప్రభుత్వం నిరుపేదల ఆరోగ్య భద్రతకు వేలాది కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నట్లు పేర్కొన్నారు. అనారోగ్యాలతో ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొంది సంబంధిత ధృవీకరణ పత్రాలతో ధరఖాస్తు చేసుకున్న వారికి సిఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థిక చేయూతనందిస్తుందని తెలిపారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## చంద్రయాన్-3 ప్రయోగం సక్సెస్‌తో రామ్‌నగర్‌లో సంబురాలు

**చిక్కడపల్లి, ఆగస్టు 24 ప్రభాతవార్త:** చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతమై విక్రమ్ ల్యాండర్ దక్షిణ ధృవంపై అడుగుపెట్టడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ రామ్‌నగర్ క్రాస్‌రోడ్స్‌లో ఎస్ఎస్.అవార్డు ప్రతినిధులు మహ్మద్ వాసిఫ్, నాజియా ఆధ్వర్యంలో గురువారం సంబురాలు జరిగాయి. ముఖ్య అతిథిగా బిఆర్ఎస్ రాష్ట్ర నేత, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. చంద్రుడిపై చంద్రయాన్-3 సాఫ్ట్‌ల్యాండింగ్‌తో ప్రతి భారతీయుడు గర్వపడుతున్నారన్నారు. పక్కాప్రణాళికతో జాగ్రత్తగా ప్రణాళిక, పటిష్టమైన డిజైన్‌లతో, చంద్రయాన్-3 చంద్రుడిపై ల్యాండింగ్‌కు, దాగిఉన్న రహస్యాలను కనుగొనడానికి అందరిని దగ్గరకుచేర్చిందన్నారు.

## పురస్కారాలు ప్రోత్సాహాన్ని అందిస్తాయి

### ప్రభుత్వ సలహాదారు రమణాచారి

**చిక్కడపల్లి, ఆగస్టు 24 ప్రభాతవార్త:** పురస్కారాలు ప్రోత్సాహాన్ని అందిస్తాయని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఛైర్మన్ డాక్టర్ కె.వి.రమణాచారి అన్నారు. అభినందన సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ ఇ.భవానీ ఆధ్వర్యంలో 'అభినందన కల్చరల్ ఎక్సెలెన్సీ అవార్డు'ల ప్రదానోత్సవ కార్యక్రమం గురువారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ ఎన్.గోపి అధ్యక్షతన జరిగింది. డాక్టర్ ఇ.భవానీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఈ పురస్కారాలను సాహితీకిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు, లేఖిని సాహితీ సంస్థ అధినేత్రి అత్తలూరి విజయలక్ష్మి, సాధన సాహితీస్రవంతి అధినేత సాధన నరసింహాచార్య, మానస ఆర్ట్స్ థియేటర్స్ స్థాపక కార్యదర్శి రఘుశ్రీలకు అందించి గౌరవించారు. ఈ కార్యక్రమంలో సుప్రసిద్ధ కవయిత్రి డాక్టర్ కెవి.కృష్ణకుమారి, మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు శ్రీమణి, నిర్వాహ సంస్థ సంయుక్త కార్యదర్శి డాక్టర్ జి.శోభాపేరిందేవి, జె.ఇందిర, డి.లలిత, సూర్యకుమారి, విశాలక్ష్మి, కె.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ గాయనీ, నంది అవార్డుగ్రహీత వి.శశికళాస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన సినీసంగీత విభావరి అందరిని అలరించింది.



పురస్కారాలను అందిస్తున్న ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి. రమణాచారి



క్రిస్టియన్ మైనార్టీ ఛైర్మన్ రాజేశ్వర్ రావును సన్మానిస్తున్న జంపనప్రతాప్, రాఘవరెడ్డి తదితరులు

## ఎమ్మెల్సీరాజేశ్వర్‌రావును మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలి

**కంటోన్మెంట్, ఆగస్టు 24 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కమిషన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు నియమితులైన సందర్భంగా గురువారం బోయిన్‌పల్లిలో ఆయన నివాసంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, ప్రముఖ వ్యాపారవేత్త సామల రాఘవరెడ్డి శాలువకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. రాజేశ్వర్ రావ్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నతపదవులు అధిరోహించాలని ఆ కాంక్షించారు.

## మంత్రి తలసానికి అభినందనలు తెలిపిన మర్రి రాజశేఖర్‌రెడ్డి



మంత్రి తలసానికి అభినందనలు తెలుపుతున్న రాజశేఖర్‌రెడ్డి తదితరులు

**కంటోన్మెంట్, ఆగస్టు 24 ప్రభాతవార్త :** సనత్‌నగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ అభ్యర్థిగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు టికెట్ ఖరారు చేయడంతో గురువారం మల్కాజిగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ ఇన్‌చార్జి మ ర్రి రాజశేఖర్‌రెడ్డి, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి బోర్డు మాజీ సభ్యులు నళినికిరణ్, అనితాప్రభాకర్, పి.శ్యామ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో కంటోన్మెంట్‌కు చెందిన బిఆర్ఎస్ నేతలు ఆనంద్‌బాబు, ప్రవీణ్‌యాదవ్, ముప్పిడి మధుకర్, పాల్గొన్నారు.

## వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీలు

### ఏకం కావాలి : నాగులశ్రీ నివాస్ యాదవ్

**కంటోన్మెంట్, ఆగస్టు 24 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ అసెంబ్లీ నుంచి తెలంగాణ రాష్ట్ర ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక పార్టీ అభ్యర్థిని గెలిపించా లని రాష్ట్ర కన్వీనర్, హైకోర్టు న్యాయవాది నాగుల శ్రీనివాస్‌యాదవ్ కోరారు. గురువారం సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో ఓటు హక్కు ఎంతో విలువైందని, ఓటర్లు నోటుకు, ఓటుకు అమ్ముడు పోకుండా బహుజన బిడ్డలను గెలిపించేందుకు ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీలన్నీ ఏకం కావాలన్నారు. గ్రేటర్‌లో గుండెకాయగా నిలిచిన సికింద్రాబాద్ అసెంబ్లీని అభివృద్ధిపర్చడంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ఘోరంగా విఫలమైయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రత్యామ్నాయ రాజకీయ కమిటీ రాష్ట్ర నాయకులు నందికంటి సాయికుమార్, బుడగ జంగం రాష్ట్ర అధ్యక్షుడు గగనం వెంకటస్వామి, నాయకులు అందోన్ వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వేతనాలు పెంచడం గర్వకారణం

**చిక్కడపల్లి, ఆగస్టు 24 ప్రభాతవార్త:** వాటర్‌బోర్డులో పనిచేసే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సిఎం కెసిఆర్‌కు రుణపడి ఉంటారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. చరిత్రలో ఏ ప్రభుత్వం చేయని విధంగా కార్మికులను గుర్తించి జీవో 60ద్వారా వేతనాలు పెంచడంతో పాటు ఉద్యోగభద్రత కల్పించి పిఆర్‌సిలో భాగస్వామ్యం చేసిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. హెచ్ఎండబ్ల్యుఎస్ఎస్‌బి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ బిఆర్ఎస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ ముద్రించిన గోడపత్రికను బిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబుయాదవ్, రాష్ట్ర కనీస వేతన సలహామండలి చైర్మన్ పి.నారాయణతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల మారయ్య, యూనియన్ ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, వర్కింగ్‌ప్రెసిడెంట్ సంతోష్, శ్రీనివాస్‌రెడ్డి, అనీల్, బాబా, బాబురావు, యాదగిరి, అమృత్ పాల్గొన్నారు. అట్టడుగు వర్గాలకు కార్మికులకు ఉద్యోగులకు చేయూనిస్తూ రాష్ట్రాభివృద్ధిలో ముందుకు తీసకెళ్తున్న కెసిఆర్‌కు కార్మికవర్గం అండగా ఉండాలని, వాటర్‌బోర్డులో పనిచేసే కార్మికులు మరింత కష్టపడి పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.

## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి, ఆగస్టు 24 ప్రభాతవార్త: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా జిల్లా, రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రముఖ సాంస్కృతిక సంస్థ అర్పిత కార్యనిర్వాహక అధికారి డాక్టర్ గణగళ్ళ విజయకుమార్ వివరించారు. ఇతర వివరాలకు 9391379903 సంప్రదించ్చని అన్నారు. విద్యారంగంలో విశేష కృషి చేసిన బోధనారంగానికి చెందిన అన్ని కేటగిరేల వారు ఈ అవార్డుకు దరఖాస్తులు చేసుకోవచ్చని, అభ్యర్థులు ఇరు తెలుగురాష్ట్రాలకు చెందిన వారై ఉండాలని, బోధనేతర రంగాల వారు వివిధ కేటగిరీలకు చెందిన అవార్డులకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. 31లోగా దరఖాస్తులు పంపించాలన్నారు.

# జనాభా ప్రాతిపదికన అరెకటికులకు ఎంపి, ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలి




మాట్లాడుతున్న సంతోష్‌కుమార్

**సైఫాబాద్, ఆగస్టు 24 ప్రభాతవార్త:** వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అన్ని రాజకీయ పార్టీలు జనాభా ప్రకారం ఎమ్మెల్యే, ఎంపి సీట్లు కేటాయించాలని అఖిల భారత అరెకటిక సంఘం డిమాండ్ చేసింది. ఇటీవల బిఆర్ఎస్ పార్టీ 115 సీట్లకు అభ్యర్థులను ప్రకటించిందని, మరో నాలుగు సీట్లు ఖాళీగా ఉన్నాయని వాటిలో ఒక అరెకటిక కులస్తులకు కేటాయించాలని సంఘం కోరింది. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అత్తికారి మలేష్, కన్వీనర్ హింగోలేకార సంతోష్‌కుమార్, నాయకులు నవీన్‌కుమార్, మహేందర్, సాయిబాబా, శేషేందర్‌రావు, దుర్గాప్రసాద్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు అరెకటికల కులాన్ని ఎస్సీ జాబితాలో చేరుస్తామని, కుల అభివృద్ధి పథకాలను అమలు చేస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చాలని డిమాండ్ చేశారు. కోకపేటలో ఆత్మగౌరవ భవనం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన కోటి రూపాయల నిధుల సరిపోవని, పది కోట్లు కేటాయించాలని, అరెకటిక ఫెడరేషన్‌ను ఏర్పాటుచేయాలని, కురుమ కులస్తులకు గొర్రెల, మేకల పెంపకం పథకం తమకు వర్తింపజేయాలని, లిక్కర్ స్కిమ్‌లో అరెకటిక కులస్తులకు రిజర్వేషన్‌లు కల్పించాలని, బీమా సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు.



కాలనీలో పర్యటిస్తున్న యోగానంద్

## బిఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలే గుణపాఠం చెప్తారు

**కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్ట్ 24, ప్రభాతవార్త :** రాబోయే కాలంలో బిఆర్ఎస్ పార్టీకి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని బిజెపి శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్, కంటెస్టెడ్ ఎమ్మెల్యే గజ్జల యోగానంద్ పేర్కొన్నారు. గురువారం యోగానంద్ ఆధ్వర్యంలో బిజెపి భరోసా యాత్ర 64వ రోజు శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని వివేకానందనగర్ డివిజన్, రామకృష్ణ నగర్, ఆర్.పి కాలనీలో పర్యటించారు. ప్రజలతో మమేకమవుతూ, ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యోగానంద్ మాట్లాడుతూ 9ఏళ్ళ పాలనలోరాష్ట్రాన్ని బిఆర్ఎస్ పార్టీ రావణ కాష్టంగా మార్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార ప్రభుత్వ హయాంలో అభివృద్ధి శూన్యమని చెప్పారు. డబల్ బెడ్ రూమ్ ఇల్లు, దళితబంధు, రైతుబంధు, పెన్షన్, ఇంటికి ఒక ఉద్యోగం, నిరుద్యోగ భృతి ఇలా ఎన్నో అబద్ధపు హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చాక అమలు చేయలేకపోయిందన్నారు. నిర్లక్ష్యపు ప్రభుత్వాన్ని గద్దెదించి బిజెపిని ప్రజలు అధికారంలో తీసుకొస్తారని యోగానంద్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్‌గౌడ్, విద్యాకల్పన, ఏకాంత్‌గౌడ్, వి.శ్రీనివాస్, శ్రీహరియాదవ్, గణేష్‌గౌడ్, అశోక్, జితేందర్, రమేష్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## క్రైస్తవులకు 30 శాతం ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలి : ముత్తయ్య

**సైఫాబాద్, ఆగస్టు 24 ప్రభాతవార్త:** వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు క్రైస్తవ జనాభా ప్రాతిపదికన 30 శాతం సీట్లు కేటాయించాలని క్రిస్టియన్ పొలిటికల్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, జెరుషాలెం మత్తయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి, టిడిపి, ఉభయ కమ్యూనిస్టు పార్టీలు, బిఎస్‌పి తదితర పార్టీలు విజ్ఞప్తి చేశారు. బిఆర్ఎస్ పార్టీ ప్రకటించిన 115 అసెంబ్లీ సీట్లలో ఒక్కటి క్రైస్తవులకు కేటాయించకుండా అన్యాయం చేసిందని, మిగిలిని నాలుగు అసెంబ్లీ స్థానాల్లోనైనా కేటాయించాలని డిమాండ్ చేశారు. క్రైస్తవులకు సీట్లు కేటాయించిన పార్టీలకే తమ మద్దతు ఉంటుందని హెచ్చరించారు. క్రైస్తవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు యోహాన్ మాట్లాడుతూ క్రైస్తవులకు రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించకపోతే అన్ని అసెంబ్లీ స్థానాలలో క్రైస్తవ అభ్యర్థులను ఎన్నికల భరిలోకి దించుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాగళ్ళ పోచయ్య, ఇశ్రాయేలు, జాన్సన్, మోజస్, దానియేల్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నల్లపోచమ్మ ఆలయ వార్షికోత్స వేడుకలు

**సికింద్రాబాద్, ఆగస్టు 24 ప్రభాతవార్త :** చిలకలగూడ కిందిబస్తీలో శ్రీనల్లపోచమ్మ దేవాలయం ఐదవ వార్షికోత్స వేడుకలను ఘనంగా జరిపారు. ఆలయదాత, ప్రముఖ సంఘ సేవకుడు, కాంగ్రెస్ నేత నాగులూరి సాయిబాబా ముఖ్యఅతిథిగా పాల్గొని పూజలు జరిపారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యాక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యాక్రమంలో వెంకటసాయి కుమార్, మాధిరెడ్డి జలందర్ రెడ్డి, రాయల్ వెంకట్, గంట రాజుసాగర్, అనిల్, జయరాం, రూపేష్, రాము, శ్రీను, సందీప్, రాజు, వెంకట్, అంజిబాబు, శ్రీను, జుట్టు శంకర్ ఇతర నేతలు పాల్గొన్నారు.

## కష్టాలు తెలిసిన నేత కెసిఆర్ : చైర్మన్ శ్రీశైలంయాదవ్



పెన్షన్ చెక్కులు అందజేస్తున్న చైర్మన్ శ్రీశైలంయాదవ్

**కొంపల్లి, ఆగస్టు 24 ప్రభాతవార్త:** ప్రజల కష్టాలు తెలిసిన నేత సిఎం కెసిఆర్ అని కొంపల్లి మున్సిపల్‌చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ అన్నారు. దివ్యాంగులు, ఆసరా పెన్షన్లను ప్రభుత్వం రూ.3016 నుండి 4016 పెంపుదలచేసిన నేపథ్యంలో గురువారం 118మంది లబ్దిదారులకు ఆయన నూతన పెన్షన్ చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు, ఆసరా పెన్షన్ లబ్దిదారులకు అండగా ఉంటానని మాట ఇచ్చిన సిఎం కెసిఆర్ వెయ్యిరూపాయలు పెంచారన్నారు. దేశంలో ఏప్రభుత్వం అందించిన విధంగా పెన్షన్లు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కెసిఆర్ అన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ గంగయ్యానాయక్, కమీషనర్ శ్రీహరి, మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, మాజీఎంపిపి సన్న కవితశ్రీశైలంయాదవ్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో డ్రైవర్ మృతి

### నష్టపరిహారం చెల్లించాలంటూ ఆందోళన

**నిజాంపేట, ఆగస్టు 24 ప్రభాతవార్త :** బాచుపల్లిలోని ఎస్వీఆర్ ట్రావెల్స్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి విధి నిర్వాహణలో మృతి చెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా, వంగూరు మండలం, జాజాల గ్రామానికి చెందిన మామిడాల శ్రీనివాస్‌రెడ్డి(48) జీవోపాధి కోసం నగరానికి వలస వచ్చి బాచుపల్లిలో నివాసం ఉంటున్నాడు. పదిహేనుళ్లగా ఎస్వీఆర్ ట్రావెల్స్‌లో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బుధవారం విధి నిర్వాహణలో భాగంగా శ్రీనివాస్‌రెడ్డి పూణే నుండి హైదరాబాద్‌కు ప్రయాణీకులతో బయలుదేరాడు. మార్గమధ్యంలోని ఔరంగబాద్ చేరుకొగానే అస్వస్థతకు గురై మృతిచెందాడు. యాజమాన్యం స్పందించకపోవడంతో తమకు న్యాయం చేయాలంటూ మృతుని కుటుంబసభ్యులు ఎస్వీఆర్ గ్యారెజ్ వద్ద మృతదేహంతో ఆందోళన చేశారు. దీంతో దిగివచ్చిన యాజమాన్యం నష్టపరిహారం చెల్లించేందుకు అంగీకరించడంతో ఆందోళన విరమించి మృతదేహన్ని స్వస్థలంకు తరలించారు.

## గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

**ఉప్పల్, ఆగస్టు 24 ప్రభాతవార్త :** గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఉప్పల్ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ శంకర్ కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా, మానకొండూర్ మండలం, వనరం గ్రామానికి చెందిన ఏకుల సందీప్ అలియాస్ శాండీ ఉప్పల్ న్యూ భరత్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. బెల్జియం వాపెల్‌లో పనిచేస్తున్న ఇతను తన స్నేహితులు అంబాలా రాకేష్, స్వరాజ్‌కృష్ణతో కలిసి తరచూ వైజాగ్ వెళ్లి అక్కడి నుంచి గుర్తు తెలియని వ్యక్తుల నుంచి గంజాయి తెచ్చి నగరంలో విక్రయిస్తున్నారని తెలిపారు. ఇదే క్రమంలో ఈనెల 23న రాత్రి పది గంటల సమయంలో అతని ఇంటిపై దాడి చేయగా పది కిలోల గంజాయి, ఒక ఫోన్, వెయింగ్ మిషన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదే విధంగా మరో కేసులో మేడిపల్లి సాయినగర్ కాలనీకి చెందిన గంజాయి వ్యాపారులు ప్రతీక్ ప్రసాద్,ఎట్టబోయిన నరేష్‌లను పట్టుకుని వారి వద్ద నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు గురువారం ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఉప్పల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కేబుల్ బ్రిడ్జిపై పల్టీలు కొట్టిన ఆటో



**హైదరాబాద్, ఆగస్టు 24 ప్రభాతవార్త:** మాదాపూర్‌లోని కేబుల్ బ్రిడ్జిపై ఎన్ని ఆంక్షలుపెడుతున్నప్పటికీ కొంతమంది డ్రైవర్ల నిర్లక్ష్యంతో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా కేబుల్ బ్రిడ్జిపై రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆటో డ్రైవర్ అత్యుత్సాహంతో ముందు వెళ్తున్న బైక్‌ను తప్పించబోయి ఓవర్ టెక్ చేశాడు. దీంతో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు : మంత్రి

**హైదరాబాద్, ఆగస్టు 24, ప్రభాతవార్త:** పేదవారి సొంతింటి కలను నెరవేర్చుకునేందుకు అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు పారదర్శకంగా నిర్వహించడం జరిగిందని పశు సంవర్థక, మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. గురువారం హైదరాబాద్ కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో ఆన్‌లైన్ లాటరీ ద్వారా డబుల్ బెడ్‌రూం ఇండ్ల కేటాయింపు కార్యక్రమానికి హోంమినిస్టర్ మహమూద్‌అలీ, నగర మేయర్ విజయలక్ష్మీ, చేవెళ్ల ఎంపి రంజిత్‌రెడ్డి, జిహెచ్‌ఎంసి కమిషనర్ రోనాల్డ్‌రోస్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమక్షంలో రాండమైజేషన్ సాఫ్ట్‌వేర్ ద్వారా ఆన్‌లైన్ డ్రా ననిర్వహించచిన లబ్దిదారులు ఎంపిక చేపట్టారు. హైదరాబబాద్ జిల్లా 15నియోజకవర్గాలలో మొదటి విడతగా ప్రతి నియోజకవర్గం నుంచి 500మంది చొప్పున 7500మంది లబ్దిదారులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. కేటాయింపుల్లో ఎలాంటి జోక్యం లేకుండా పారదర్శకంగా నిర్వహించడం జరిగిందని, పేదవారు ఆత్మగౌరవం తో బ్రతకాలనే ఉద్దేశంతో ఇళ్లు కట్టించడం జరిగిందని తెలిపారు. మూనవ ప్రయత్నంతో లాటరీ ద్వారా కేటాయింపు చేసే ప్రక్రియ కన్నా ఇది ఎన్నోరెట్లు పారదర్శకత, జాబుదారి తనాన్ని సూచిస్తుందని ఈప్రక్రియ ఇండియాలో మొదటిసారి ప్రవేశపెట్టడం జరిగిందని ఇది నిరంతరం కొనసాగుతుందన్నారు. జిహెచ్‌ఎంసి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఈప్రకియలో ప్రధాన భూమిక పోషించారని వారి అభినందనలు తెలిపారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు పారదర్శకంగా జరగాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్ఐసి సహకారంతో రాండమైజేషన్ సాఫ్ట్‌వేర్ ద్వారా ప్రజాప్రతినిధులసమక్షంలో లబ్దిదారుల ఎంపిక చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ మధుసూధన్, డిఆర్‌ఓ వెంకటచారి, ఎన్ఐసి అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి తలసాని, కలెక్టర్, మేయర్ తదితరులు

## మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు : టిటిఐ ఏసీపీ శంకరరాజు.

**బేగంపేట ఆగస్టు 24, ప్రభాతవార్త :** తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, అలాగే వాహనాలు నడుపుతున్న సమయంలో మొబైల్ ఫోన్లు వాడవద్దని బేగంపేట టీటీఐ ఏసీపీ జి.శంకరరాజు అన్నారు. గురువారం సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్‌లో 67వ ఎస్‌జీఎఫ్ ఇంటర్ స్కూల్స్ (మండలస్థాయి) ఖబడ్డీ,మరియూ ఖోఖో టోర్నమెంట్ కమ్ సెలక్షన్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్ జిల్లా విద్యాధికారి ఆర్ రోహిణి సహకారంతో ట్రాఫిక్ అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన ఏసీపీ శంకరరాజు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ట్రాఫిక్ నిబంధనలను తెల్సుకోవాలని అన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడపవద్దాన్నారు. అలాగే సీటు బెల్టు తప్పక ధరించాలన్నారు. ప్రతి విద్యార్థి వారి తల్లి దండ్రులకు ఈ విషయంపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి ఎన్.సుధాకరరావు, టీటీఐ ఇన్స్ పెక్టర్ జి.సంజీవ్, 800మంది విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చంద్రుడిపై సత్తా చాటిన ఇస్రో శాస్త్రవేత్తలు

**- నార్సింగిలో విజయోత్సవం చేసుకున్న విద్యార్థులు**

**నార్సింగి, ఆగస్టు 24 ప్రభాతవార్త :** చంద్రయాన్-3 విజయం భారత అంతరిక్ష శాస్త్రవేత్తల సత్తాను ప్రపంచానికి చాటిందని నార్సింగి మున్సిపల్ వైస్ చైర్మన్ గొర్ల వెంకటేష్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం నార్సింగి లోని నాగార్జున హైస్కూల్‌లో విద్యార్థులు చంద్రయాణ్-3 విజయవం పట్ల భారీ కేక్ కట్ చేసుకొని సంబరాలు జరుపుకున్నారు. భారత్‌మాతాకి జై అంటూ త్రివర్ణ పతాకాలు చేతబూని కేరింతలు కొట్టారు. ఈ సందర్భంగా వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ చంద్రుడి దక్షిణ ధృవంపై తొలిసారిగా అడుగు పెట్టి భారత సత్తాను ప్రపంచానికి చాటడం గర్వంగా ఉందన్నారు. అమెరికా, రష్యా, చైనాలకు సాధ్యం కానిది మన శాస్త్ర వేత్తలు సుసాధ్యం చేసి అంతరిక్షంలో మనకు ఎదురు లేదని నిరూపించారన్నారు. భావి భారత పౌరులైన విద్యార్థులంతా ఉన్నతమైన లక్షాలను ఎంచుకొని వాటి సాఫల్యత కోసం నిరంతరం శ్రమించాలని సూచించారు. ప్రశ్నించడం అలవాటుగా మార్చుకుంటే శాస్త్రవేత్తలుగా తయారు కావచ్చన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాల ఎంప్లాయిస్ కోఆపరేటివ్ క్రిడెట్ సొసైటీ ఎన్నికలు

**చిక్కడపల్లి, ఆగస్టు 24 ప్రభాతవార్త:** డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాల ఎంప్లాయిస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ అధ్యక్షుడిగా నానేపల్లి జగ్గారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఎన్.కుమారస్వామి, కార్యదర్శిగా ఎన్.వెంకటేశ్, కోశాధికారిగా ఎన్.రఘు, మేనేజింగ్ కమిటీ సభ్యులుగా జె.అన్నపూర్ణ, జి.కాంచనమాల, ఎం.జంగయ్య, బి.శ్రీధర్, సి.రాజులుగా ఎన్నికైన వారిలో ఉన్నారు. సొసైటీ ఏర్పాటు అయిన 45 సంవత్సరాలు పూర్తయిందని, సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఈ సొసైటీ ద్వారా ఎంతో ఉపయోగపడుతోందని అన్నారు. సొసైటీ ఉద్యోగులకు, సభ్యులకు సంపూర్ణ సహకారాన్ని అందిస్తూ ఎంతో అభివృద్ధి చేస్తోందన్నారు. క్రెడిట్ సొసైటీకి జరిగిన ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగింది.

## రాష్ట్రంలో వికలాంగులు సిఎం కెసిఆర్‌కు రుణపడతారు

**చిక్కడపల్లి, ఆగస్టు 24 ప్రభాతవార్త:** రాష్ట్రంలో వికలాంగులంతా సిఎం కెసిఆర్ నాయకత్వంలోని బిఆర్ఎస్ ప్రభుత్వానికి అండగా ఉంటారని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పిఆర్‌డి) వ్యవస్థాపకులు తుడుం రాజేందర్, రాష్ట్ర అధ్యక్షుడు దైనంపల్లి మల్లికార్జున్ అన్నారు. వికలాంగులకు ప్రతి నెల అందించే ఫించన్‌ను రూ.4,016కు పెంపుతో ఈ వర్గాల గుండెల్లో కెసిఆర్ పదిలంగా ఉంటారని అన్నారు. గురువారం ఎన్‌పిఆర్‌డి ఆధ్వర్యంలో వికలాంగులకు ఫించన్ పెంపు పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా 'జయహో కెసిఆర్' నినాదాలు చేస్తూ 'మీవెంటే మేమంతా' అంటూ ప్లకార్డులను ప్రదర్శించిన అనంతరం కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. దేశంలో ఎక్కడాలేని విధంగా వికలాంగులకు రూ.4,016 ఫించన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం ఒక్కటేనని, బంగారు తెలంగాణ సాధనలో ఇది ఒక మైలురాయిగా నిలుస్తుందని, ఫించన్ పెంపుతో వికలాంగుల ఆత్మవిశ్వాసం రెట్టింపు అయిందన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కెసిఆర్‌కు వికలాంగులు, కుటుంబాలు అండగా నిలుస్తారన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మహిళా నాయకురాలు తుడుం లక్ష్మి పాల్గొన్నారు.

## బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబర్‌గా పోచయ్య యాదవ్‌ను నియామకం

**నాచారం, ఆగస్టు 24 ప్రభాతవార్త:** బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్‌గా లాలాపేట్‌కు చెందిన సీనియర్ బిజెపి నాయకులు పోచయ్య యాదవ్‌ను నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి. కిషన్ రెడ్డి నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పోచయ్య యాదవ్ కిషన్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు శ్యామ్ సుందర్ గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం పోచయ్య యాదవ్ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి తగిన ప్రాధాన్యత కల్పించడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో బిజెపిని మరింత బలోపేతానికి తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. పోచయ్య యాదవ్ గతంలో డివిజన్ ప్రసిడెంట్‌గా, డెయిరీ సెల్ కన్వీనర్‌గా, రాష్ట్ర జాయింట్ కన్వీనర్‌గా, ఓబీసీ రాష్ట్ర కమిటీ మెంబర్‌గా పనిచేశారు.

## ముదిరాజ్‌లకు బిఆర్ఎస్ నుంచి ఒక్క సీటు ఇవ్వలేదు

**తార్నాక, ఆగస్టు 24 ప్రభాతవార్త:** రాష్ట్రంలో 60లక్షల జనభా ఉన్న ముదిరాజ్ కులస్థులకు బీఆర్ఎస్ నుంచి సీఎం కేసీఆర్ ఒక్క ఎమ్మెల్యే టికెట్‌ను కెటాయించకపోవడం పట్ల తమ ఆత్మగౌరవం ఎంతో దెబ్బతిన్నదని బీఆర్ఎస్ రాష్ట్రనాయకులు లల్లూముదిరాజ్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన ముదిరాజ్ కులస్థులతో కలిసి పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో బీఆర్ఎస్ అభ్యర్థులు ఘనవిజయం సాధించాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం లల్లూ ముదిరాజ్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ కోసం పోరాడిన క్రమంలో తమ ముదిరాజ్‌లు సుమారు వందమందికి పైగా అమరులయ్యారని అలాంటి కులం నుంచి ఒక్క సీటును కూడా ఇవ్వకపోవడం తమను తీవ్రంగా కలచివేస్తుందన్నారు. 114 టికెట్లను ప్రకటించిన సీఎం మిగితా పెండింగ్‌లో ఉన్న నాలుగు సీట్లలో తమ కులానికి ప్రాధాన్యత కల్పించాలని కోరారు. తమ కులం గురించి గొప్పదనం గురించి సీఎం కేసీఆర్ పలు సందర్భాల్లో మాట్లాడారని అలాంటి తమకు ఆయన ప్రాధాన్యత కల్పిస్తారని కాని నిరాశే మిగిలిందని వాపోయారు. ఇప్పటికైనా తమను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాజు ముదిరాజ్, వినోద్ ముదిరాజ్, శేఖర్ ముదిరాజ్, బబ్లూ ముదిరాజ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## సిఎం కెసిఆర్‌ను కలిసిన రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ప్రతినిధులు

**చార్మినార్, ఆగస్టు 24 ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్‌ను రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి పుస్తె శ్రీ కాంత్‌తో పాటు పలువురు రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ప్రతినిధులు, చారి ్మనార్ నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు కలిశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు నాయికోటి రాజు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఆనంద్‌గుప్తా

**చార్మినార్, ఆగస్టు 24 ప్రభాతవార్త :** రాష్ట్ర బిజెపి కౌన్సిల్ సభ్యులుగా పాతబస్తీకి చెందిన డి.ఆనంద్ గుప్తా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రమంత్రి, రాష్ట్ర బిజెపి అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. నూతనంగా నియమితులైన రాష్ట్ర బిజెపి కౌన్సిల్ సభ్యులు డి.ఆనంద్ గుప్తా మాట్లాడుతూ బిజెపి పటిష్టత కోసం శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర బిజెపి కౌన్సిల్ సభ్యులుగా నియమితులైన డి.ఆనంద్ గుప్తా 35 సంవత్సరాలు నుంచి బిజెపిలో కొనసాగుతున్నారు. నాలుగు సార్లు రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులుగా ఆనంద్ గుప్తా కొనసాగారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజలతో మమేకమై పనిచేద్దాం : కసిరెడ్డి భాస్కరరెడ్డి

**శేరిలింగంపల్లి, ఆగస్టు 23 ప్రభాతవార్త :** ప్రజాసమస్యలను గుర్తించి వాటి పరిష్కారం దిశగా సమిష్టిగా కృషిచేసి వారి మన్ననలను పొందే విధంగా పనిచేద్దామని బిజెపి రాష్ట్ర నాయకులు కసిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు. చందానగర్‌లోని స్వాగత్ హోటల్‌లో బిజెపి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర బిజెపి నాయకులు కసిరెడ్డి భాస్కరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం మారాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని వ్యవస్థలు నిర్వీర్యమై మాఫియా వ్యవస్థలు రాజ్యమేలుతున్నాయన్నారు. బిఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తే రాష్ట్రం అప్పుల ఊబిలో మరింతగా కూరుకుపోయే ప్రమాదముందని హెచ్చరించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అధికారులు ప్రజలకు కాకుండా అధికార పార్టీ అడుగులకు మడుగులొత్తుతున్నారని ఆయన విమర్శించారు. జీహెచ్ఎంసీ, రెవెన్యూ కార్యాలయాలు, అధికార పార్టీకి దళారులకు అడ్డాలుగా మారాయన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు అజిత్‌కుమార్ సేనాపతి, నూనె సురేందర్, చిలకమర్రి శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ బి.వి.సత్యరమేశ్, నందనం వినయ, రాధామూర్తి, వేణుగోపాల్, త్రినాధ్, డాక్టర్ కే.రాజేందర్‌రెడ్డి, నరేశ్ కుమార్, కుందన్‌కుమార్ గుప్త, ఎల్ల ఆంజనేయులు, చందు, ప్రభాకర్, పాండుగౌడ్, శ్రీనివాస్, రాజేశ్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

## మహారాష్ట్ర బిజెపి ఎమ్మెల్యేతో భేటి అయిన మాధవరం కాంతారావు

**కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్టు 20, ప్రభాతవార్త :** కూకట్‌పల్లికి విచ్చేసిన బిజెపి సీనియర్ నాయకులు, మహారాష్ట్ర అంధేరి శాసనసభ్యులు అమీత్ భాస్కర్ సతమ్‌ని గురువారం అసెంబ్లీ బిజెపి ఇంచార్జీ మాధవరం కాంతారావు శాలువా తో సత్కరించారు. అనంతరం కూకట్‌పల్లి అసెంబ్లీలో ప్రస్తుత పార్టీ కార్యక్ర మాలు, నూతన చేరికలు, ప్రజలకు అందుతున్న కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఓటర్ల నాడి, సంస్థాగత పార్టీ బలోపేతానికి అనుసరిస్తున్న విధానా లపై వారు చర్చించారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ బిజెపిని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కమలనాథులు కృషి చేయాలన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో 8రోజుల పాటు మకాం వేసి, డివిజన్ల వారిగా పోలింగ్ బూత్ కమిటీ, శక్తి కేంద్రం, ఇంచార్జీలతో సమీక్షలు నిర్వహిస్తామన్నారు.

## ప్రకాశ్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ నేతలు

**నార్సింగి, ఆగస్టు 24 ప్రభాతవార్త :** వరుసగా నాలుగోసారి రాజేంద్రనగర్ ఎమ్మెల్యేగా బరిలోకి దిగే అవకాశంను దక్కించుకున్న ప్రకాశ్‌గౌడ్‌కు గండిపేట మండల బిఆర్ఎస్ నాయకులు పుష్పగుచ్చాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి తలారి మల్లేష్ ముదిరాజ్, గండిపేట మండల బిఆర్ఎస్ అధ్యక్షులు రామేశ్వరం నర్సింహా, మైనార్టీ నాయకుడు బషీర్, మణికొండ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి, అధ్యక్షులు శ్రీరాములు ఎమ్మెల్యేకు శాలువాలతో సన్మానించి, ప్రకాశ్‌గౌడ్ నాయకత్వం వర్ధిల్లాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరుసగా నాలుగోసారి ప్రకాశ్‌గౌడ్‌ను గెలిపించుకుంటామన్నారు.

## భారతికి తెలుగు విశ్వవిద్యాలయ కీర్తి పురస్కారం

**నాంపల్లి, ఆగస్టు 24 ప్రభాతవార్త :** ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పిహెచ్‌డి పూర్తిచేసి, అదే గ్రంథాలయశాఖ పూర్వ అధ్యక్షురాలైన డా. కందిమళ్ళ భారతికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం గ్రంథాలయ సమాచారశాస్త్రంలో చేస్తున్న విశిష్టకృషికి గుర్తింపుగా ప్రతిష్టాత్మక కీర్తి పురస్కారం అందిస్తున్నట్లు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు అధ్యక్షతన కమిటీ ఈ పురస్కారానికి ఎంపికచేసినట్లు రిజిస్ట్రార్ ఆచార్య భట్టురమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. కె.భారతి గ్రంథాలయ సమాచారశాస్త్రంలో వరుసగా మూడు స్వర్ణపతకాలను సాధించడమే కాక ఆ రంగంలో జరిగిన నాలుగు అంతర్జాతీయ సదస్సుల్లో, తొమ్మి జాతీయస్థాయి సదస్సుల్లో, అయిదు అంతర్జాతీయ మహాసభల్లో పాల్గొని 12 కార్యశాలలను, ఒక అంతర్జాతీయ వెబినార్‌ను నిర్వహించారు. వివిధ ప్రత్యేక సంచికల్లో పదహారు పరిశోధనాపత్రాలు ప్రచురింపబడిన డా. భారతి సంపాదకత్వంలో తెలంగాణ వీరనారి ఆరుట్ల కమలాదేవి; ఆత్మీయం; యలమంచిలి విజయ్‌కుమార్ రచనలు అన్న గ్రంథాలు వెలువడ్డాయి. ఎం.ఎల్.ఐ.ఎస్సీలో జాతీయస్థాయిలో అత్యుత్తమ మార్కులు సంపాదించి అప్పటి భారత ఉప రాష్ట్రపతి కృష్ణకాంత్ నుండి బంగారు పతకాన్ని, దేశప్రధాని అటల్‌బిహారీ వాజ్‌పేయి ఆహ్వానం మేరకు భారత గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జాతీయ స్థాయి ప్రతిభావంతులైన విద్యార్థులతోపాటు పాల్గొన్నారు. త్వరలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో జరుగబోయే ప్రత్యేక కార్యక్రమంలో డా. కె.భారతికి కీర్తి పురస్కారం ప్రదానం చేయనున్నారు.

## ప్రజలకు రుణపడి ఉంటా-ఎమ్మెల్యే

**చిక్కడపల్లి ఆగస్టు 24 ప్రభాతవార్త:** ముషీరాబాద్ నియోజకవర్గ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఈ దఫా జరిగే ఎన్నికల్లో తనను మరోసారి ఆశీర్వదించాలని స్థానిక ఎమ్మెల్యే, బిఆర్ఎస్ అభ్యర్థి ముఠాగోపాల్ అన్నారు. మంగళవారం బిఆర్ఎస్ సీనియర్ నేత తుడుం రాజేందర్ ఆధ్వర్యంలో టికెట్ లభించిన సందర్భంగా ఘనంగా సత్కరించే కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో లక్ష్మీగణపతి దేవాలయం చైర్మన్ ముచ్చుకుర్తి ప్రభాకర్, బిఆర్ఎస్ నేతలు శంకర్ మూదిరాజ్, శ్రీధర్‌చారి, వివేక్, దైనంపల్లి మల్లికార్జున్, ముచ్చుకుర్తి పద్మ, తుడుంలక్ష్మి, సుధా తదితరులు పాల్గొన్నారు.

## క్రాస్‌రోడ్స్, అశోక్‌నగర్‌లో ట్రాఫిక్ సమస్యలను పరిశీలించిన పోలీసు ఉన్నతాధికారులు

**చిక్కడపల్లి, ఆగస్టు 24ప్రభాతవార్త:** లోయర్‌ట్యాంక్‌బండ్ నుంచి వీఎస్టీ వరకు నిర్మించిన స్టీల్‌బ్రిడ్జ నిర్మాణం వల్ల అశోక్‌నగర్, ఆర్టీసిక్రాస్‌రోడ్స్, రామ్‌నగర్ టర్నింగ్, అజామాబాద్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య చాలా వరకు తగ్గినట్లు పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా స్టీల్‌బ్రిడ్జ నిర్మాణం తర్వాత ట్రాఫిక్ సమస్యకు ఏమైనా చెక్‌పడిందా అనే వివరాలు తెలుసుకోవడానికి మంగళవారం నగర ట్రాఫిక్-2 డీసీపీ ఎన్.అశోక్‌కుమార్, సెంట్రల్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ రత్నంలు ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లో పరిశీలించారు. ఈ సందర్భంగా చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ వీరేశం నుంచి వివరాలు సేకరించారు. ఉదయం విధులకు వెళ్లేవారు, సాయంత్రం విధులను ముగించుకుని ఇంటికి వచ్చేవారు చాలా వరకు స్టీల్‌బ్రిడ్జ్‌పై నుంచి చాలా వరకు వెళ్తున్నారని, దీనివల్ల ఆయా సమయాల్లో ట్రాఫిక్ సమస్య చాలా వరకు తగ్గిందని డీసీపీకి వివరించారు. రామ్‌నగర్, విద్యానగర్, ఉస్మానియా విశ్వవిద్యాలయం, నల్లకుంట, అంబర్‌పేట ప్రాంతాలకు వెళ్లేవారు ట్యాంక్‌బండ్‌కు వెళ్లాలంటే నేరుగా స్టీల్‌బ్రిడ్జ్‌పై నుంచి వస్తున్నారని, ఈ ప్రాంతాలకు ట్యాంక్‌బండ్ నుంచి వచ్చేవారు కూడా ఈ బ్రిడన్జపై నుంచి వెడుతున్నారని వివరించారు.



సోమాజీగూడలో ఒక కార్యక్రమానికి హాజరైన సినీనటి రకుల్‌ప్రీత్‌సింగ్

## బన్సీలాల్‌పేట శ్మశానవాటికలో బత్తిని హరినాథ్‌గౌడ్‌కు అంత్యక్రియలు

**పలువురు ప్రజాప్రతినిధులు నివాళి**

**ధర్నాచౌక్, ఆగస్టు 24, ప్రభాతవార్త:** లక్షలాది ఆస్థమా బాధితులకు చేప మందు అందించి, ఎంతో మందికి ఆరోగ్యాన్ని ప్రసాదించిన బత్తిని హరినాథ్‌గౌడ్(84) బుధవారం రాత్రి మృతి చెందారు. ఉబ్బస వ్యాధిగ్రస్తులకు చేప మందు అందించి, ఎందరికో ఆరోగ్యాన్ని అందించిన హరినాథ్‌గౌడ్ మరణ వార్తతో ఆయన వద్ద చేపమందు తీసుకున్న ఆయన అభిమానులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ప్రతి సంవత్సరం మృగశిరకార్తెలో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఈయన అందించే చేపమందు తెలియని వారు తెలుగు రాష్ట్రాలలోనే కాదు యావత్ భారతదేశంలో లేరంటే అందులో అతిశయోక్తి లేదు. 1944లో దూద్‌బౌలిలో జన్మించిన హరినాథ్‌గౌడ్ గత 40 సంవత్సరాలుగా భోలక్‌పూర్‌లోని పద్మశాలికాలనీలో నివసిస్తున్నారు. ఆయనకు భార్య సుమిత్ర, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన తాత ముత్తాతల నుండి ఉబ్బస వ్యాధిగ్రస్తులకు ప్రతి కార్తీకమాసంలో చేపమందు అందిస్తూ వస్తున్నారు. హరినాథ్‌గౌడ్ చిన్నతనంలోనే నానమ్మ సత్యమ్మ వద్ద చేప మందు ప్రసాదం తయారీ నేర్చుకుని, తన అన్నదమ్ములతో కలసి ఉబ్బస వ్యాధితో బాధపడుతున్న వారికి అందిస్తూ ఉన్నాడు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న హరినాథ్‌గౌడ్ బుధవారం రాత్రి షుగర్ లెవెల్స్ పెరిగిపోవటంతో ఇంట్లోనే మృతి చెందారు. హరినాథ్ గౌడ్ మృతి పట్ల పలువురు ప్రజాప్రతినిధులు సంతాపం తెలియచేశారు. హరినాథ్‌గౌడ్ ఒక కుమారుడు ఆస్ట్రేలియా నుండి, ఒక కుమార్తె అమెరికా నుండి రావల్సి ఉన్నందున ఆయన అంత్యక్రియలు శుక్రవారం బన్సీలాల్‌పేట లోని స్మశాన వాటికలో నిర్వహిస్తామని కుటుంబసభ్యులు తెలిపారు.

హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ సంతాప సందేశం: ఉబ్బసం వ్యాధిగ్రస్తులకు చేపమందు అందించే బత్తిని హరినాథ్‌గౌడ్ మృతి తనకు ఎంతో బాధను కలిగించిందని తెలిపారు. హరినాథ్‌గౌడ్ కుటుంబం తయారుచేసే చేప మందు అనేక సంవత్సరాలుగా దేశ వ్యాప్తంగా ఉన్న అనేక మంది ఉబ్బసం వ్యాధిగ్రస్తులకు ఉపశమనం కలిగిస్తోందని పేర్కొన్నారు. హరినాథ్‌గౌడ్ చేసిన నిస్వార్ధ సేవతో అందరి మన్ననలు పొందారని, ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుడిని ప్రార్థిస్తూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియచేస్తున్నానని అన్నారు.

## అంకితభావానికి నిదర్శనం పోలీసులు : రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

**రవీంద్రభారతి, ఆగస్టు 24 ప్రభాతవార్త :** పోలీసుశాఖలో పనిచేయడం కష్టతరం, చాలా క్లిష్టమైనదని, ఎన్నో ఒత్తిడితులు, సమస్యలను ఎదుర్కొంటూ అందరితో ఎంతో సామరస్యంగా ముందుకుపోవాల్సి వస్తుందని, నియమ నిబద్ధత, కార్యదక్షత, అంకితభావానికి పోలీసులు నిదర్శనమన్న రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, అనివార్య పరిస్థితుల్లో పోలీసులు తమ ప్రాణాలను లెక్కచేయకుండా కుటుంబాలకు దూరంగా వృత్తి ధర్మ నిర్వహించాల్సి వస్తుందని, అలాంటి ఉత్తమ సేవలందిస్తున్న పోలీసులను పురస్కారాలతో సత్కరించి గౌరవించడం హర్షదాయమని ఆయన అన్నారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, సీల్‌వెల్ కార్పొరేషన్, శృతిలయ ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్.కృష్ణయ్య విశిష్ట అతిథులు కోలేటి దామోదర్ గుప్తా, ఆమని, మహ్మద్‌రఫీ, దైవజ్ఞశర్మ, విజయకుమార్‌తో కలిసి ఉత్తమ పోలీసు మెడల్స్ అందుకున్న బోధన్ ఏసిపి కెఎం.కిరణ్‌కుమార్, సిఐడి డీఎస్పీ భూపతి శ్రీనివాసరావు, టాస్క్‌ఫోర్స్ ఏసిపి డా.ఎం.జితేందర్‌రెడ్డి, గ్రేహౌండ్స్ అదనపు ఎస్పీ ఎ.వెంకటేశ్వర్‌రావులను ఘనంగా సత్కరించి శృతిలయ ప్రతిష్టాత్మక ప్రైడ్ ఇఫ్ ఇండియా పురస్కారాలను ప్రదానం చేశారు.



బేగంపేటలో నేషనల్ హయ్యర్ ఎడ్యుకేషన్‌పై జరిగిన సదస్సులో శ్రీకర్ ఆలపాటి తదితరులు

## అంతరిక్ష శాస్త్రం కోసం బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలి

**అఖిల భారత ప్రగతిశీల వేదిక రాష్ట్ర కన్వీనర్ వి.ఎస్.బోస్**

**సైఫాబాద్, ఆగస్టు 24 ప్రభాతవార్త:** అంతరిక్ష పరిశోధనలో చంద్రయాన్-3 విజయం పెద్ద ముందడుగు అని ఇస్రో శాస్త్రవేత్తలు యావత్ దేశం గర్వించేలా చేశారని అఖిల భారత ప్రగతిశీల వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ వి.ఎస్.బోస్ చెప్పారు. చంద్రయాన్-3 మిషన్ విజవంతంగా ల్యాండింగ్ అయిన సందర్భంగా వేదిక తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో గురువారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌వద్ద సంబరాలు జరిగాయి. జాతీయ పతకాలను చేబూని శాస్త్రీయ విజ్ఞానం వర్ధిల్లాలని కోరుతూ విద్యార్థులు, ప్రతినిధులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ మిఠా యిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వి.ఎస్.బోస్ మాట్లాడుతూ చంద్ర యాన్- 3, ఆదిత్య ఎల్-1 వంటి మిషన్‌లను కలిగి ఉన్న అంతరిక్ష శాస్త్రం కోసం ఖర్చు 32 శాతం నిధులను 2023-24లో కేంద్రం బడ్జెట్‌లో తగ్గించిందని ఆరోపించారు. అయినప్పటికి మన శాస్త్రవేత్తలు నిరాశచెందకుండా ధైర్యంగా తమ మిషన్‌ను విజయవంతంగా పూర్తిచేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు పి.ప్రేమ్‌పావని, కె.ధర్మేంద్ర, సత్యప్రసాద్, నిర్లకంటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రయాన్-3 విజయవంతం దేశానికి గర్వకారణం

భారతీయ అంతరిక్షా పరిశోధన చరిత్రలో చంద్రయాన్-3 విజయవంతం కావడం దేశానికి గర్వకారణమని సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి కొనియాడారు. ప్రపంచ వ్యాప్తంగా అగ్రరాజ్యాలుగా కొనసాగుతున్న దేశాలు ఆనేక ప్రయత్నాలుచేసి విఫలం చెందాయని, కాని మనదేశంలో ఉన్న ఇస్రో శాస్త్రవేత్తలు, సిబ్బంది ఎంత కష్టపడి చంద్రయాన్- 3ను విజయవంతంగా చంద్రగ్రహం దక్షిణ ధ్రువంపై ల్యాండ్ చేయడం జరిగిందన్నారు. హిందూస్తాన్ ఏరోనాటికల్, బిహెచ్ఇఎల్, మిధాని వంటి ఆనేక ప్రతిష్టాత్మక సంస్థలు చంద్రయాన్-3ను ప్రయోగించడంలో క్రియాశీలక పాత్రను పోషించాయన్నారు. భవిష్యత్తులో మరిన్ని నూతన ఆవిష్కరణలకు బాటలు వేసేలా చర్యలు తీసుకోవాలని ఆమె శాస్త్రవేత్తలకు విజ్ఞప్తి చేశారు.

## విశ్వరహస్యాలను తెలుసుకునేందుకు ఇదొక అద్భుత అవకాశం

**ధర్నాచౌక్, ఆగస్టు 24, ప్రభాతవార్త:** విశ్వ రహస్యాలను తెలుసుకునేందుకు అద్భుత అవకాశం చంద్రయాన్ 3 ద్వారా మనకు లభించిందని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం తెలంగాణ న్యాయవాదులు చంద్రయాన్ 3 విజయవంతం సందర్భంగా సంబరాలు నిర్వహించి, ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలియచేశారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సైన్స్ విషయంలో ఈరోజుకి కూడా ఎన్నో అర్థం కాని విషయాలు ఉన్నాయని, వాటిని పరిష్కరించే దిశగా భారత్ అడుగులు వేయటం గర్వించదగిన విషయమని అన్నారు. మనం ఈ దశకు చేరుకోవటానికి దశాబ్దాల కృషి ఉందని గుర్తుచేశారు. చంద్రయాన్ అందించే సమాచారం ఒక్క భారతదేశానికే కాకుండా సమస్త మానవాళికి ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు విజయ్‌దేవరాజ్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, రావుల వెంకట్‌రెడ్డి, భిక్షమయ్య, మంత్రి రవీందర్‌రావు పాల్గొన్నారు.

## దేశంలో యువతకు స్ఫూర్తినిచ్చిన ఘనత రాజీవ్‌గాంధీదే

**చిక్కడపల్లి, ఆగస్టు 24 ప్రభాతవార్త:**

ఎఐసిసి ఫిషర్‌మెన్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి బిజ్జు శత్రు రావు ఆధ్వర్యంలో పిల్లలకు నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. స్థానిక రెయిన్‌బో స్కూల్‌లో వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ఖాదర్, శ్రీకాంత్, రాము, వేణు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిజ్జు శత్రు మాట్లాడుతూ ఐటి, టెలికాం రంగాలు దేశంలో అభివృద్ధి జరిగిందంటే దానికి మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్‌గాంధీ కారణమని అన్నారు. రాజీవ్‌గాంధీ కారణం అని అన్నారు. దేశంలో యువతకు రాజీవ్ ఒక స్ఫూర్తినిచ్చారని, పల్లెలే దేశానికి పట్టుకొమ్మలన్న మహాత్మగాంధీ మాటలను రాజీవ్ నిజం చేశారన్నారు.




పాపపేరు : అద్విక

తల్లిదండ్రులు : బండారి మహేష్, మౌనిక


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
టెండర్ ప్రకటన ('ఇ' ప్రొక్యూర్‌మెంట్ ద్వారా)
GHMC

నిట్ నం.27/EE/GHMC/DIV-21/2023-24 తేది: 24.08.2023
పైన పేర్కొన్న నం. ప్రకారం (ఐటమ్ నం.01 నుండి 02) కొరకు 02 పనుల యొక్క అంచనా ధర రూ.71.00 లక్షలతో ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు కోరబడుతున్నవి. బిడ్స్ విక్రయం వెబ్‌సైట్ 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ పై 25.08.2023 మ.2.00గం. ఆఫైన్ తెరువబడును. బిడ్స్ దాఖలుకు చివరి తేది: 02.09.2023 మ.2.00గం. దాఖలు సమయానికి ఒక గంట ముందుగా బిడ్స్ విక్రయ ముగింపు చేయబడుతుంది. తదుపరి వివరాలు వెబ్‌సైట్ https://tender.telangana.gov.in పై చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, చందానగర్ డివిజన్-21, SLP జోన్, GHMC.
DIPR.No.5759-PP/CL/Advt/1/2023-24 తేదీ: 24.08.2023



తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
కులీ కుతుబ్ షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, హైదరాబాద్
GHMC

నిట్ నం. టెండరు నోటీసు నం.10/CE/QQSUDA/2023-24 (2వ పిలుపు) తేది: 23.08.2023
పనిపేరు : హైదరాబాద్, చార్మినార్, మీర్ ఆలం మండీ కమాన్ యొక్క నవీకరణ మరియు పునరుద్ధరణ. మొత్తం (రూ.లక్షలలో) : రూ.92.50. బిడ్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేది మరియు సమయం : బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 28.08.2023 మ.3.30గం. డౌన్‌లోడింగ్ ముగింపు తేది: 05.09.2023 సా.4.00గం. బిడ్ స్వీకరణకు చివరి తేది మరియు సమయం : 05.09.2023 సా.4.30గం. బిడ్ తెరువు తేది: 05.09.2023 సా.4.45గం. అధికారి పేరు మరియు చిరునామా సెల్ నెం. శ్రీ జి.గురువీర్, చీఫ్ ఇంజనీర్, QQSUDA, దారుల్‌షిఫా, హైదరాబాద్. 9989488572. తదుపరి వివరాలు https://eprocurement.telangana.gov.in వద్ద చూడవచ్చును.
DIPR.No. 5756-PP/CL/Advt/1/2023-24 తేదీ: 24.08.2023 సం/- చీఫ్ ఇంజనీర్, QQSUDA.



**IN THE COURT OF THE HON'BLE XI JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT :: AT: SECUNDERABAD**
**O.S. No. 706 OF 2023**

Between:
Sandra Marian Francis & Others ...Plaintiffs
AND
The Thasildhar, Secunderabad Mandal and All Concerned. ..Defendants

To
ALL CONCERNED

The above named Plaintiffs filed a Suit for Declaration of Legal Heirs on the file of the Hon'ble XI Junior Civil Judge, City Civil Court, Secunderabad vide O.S. No. 706 OF 2023 and the Hon'ble Court issued a Notice to All Concerned in the above Suit for information purpose. Take Notice that the above said Case was posted on 11-09-2023 at 10:30 A.M. for your appearances. Anyone who related to the above case are hereby called upon to appear in the Court on the above said date in person or through Advocate, otherwise the case will be heard and decided Ex-Parte.

(BY ORDER OF THE COURT)
Sd/- M/s. T.S.K. TRILOK RAJ
ADVOCATES
H.No. 1-1-776/2, 1 Floor, Opp. Sri Parameshwara Ramalayam, SBI Colony, Gandhi Nagar, Hyderabad - 080.
Mobile: 9391012278, 9652795795, 9032528289.



**IN THE COURT OF THE HON'BLE XIV ADDL. CHIEF JUDGE, CITY CIVIL COURTS AT HYDERABAD**
**O.S.No: 398 of 2023**

Between:
Smt. Sarah R Stuhldreher ...Plaintiff
AND
The Tahasildar, Golkonda Mandal, & another ...Defendants

To,
D2: All Concerned
Take notice that the plaintiffs have filed the above suit for declaration, declaring them as the legal heirs and successors of deceased Afshan Khan and the said case is stands posted to 05-10-2023. If any person or persons having any claims, objections if whatsoever, they may appear either in person or through an Advocate before the above Hon' ble Court on 05.10.2023 at 10-30 A.M. Otherwise the matter will be decided basing on the documents available on record.

SCHDULE OF PROPERTY
All that the all that the Flat having a super built up area of 4239 Square feet including common areas, balconies and storage Room No: 11 and bearing No: 1101 Situated at 5th floor of Krishe Valley including three No: (03) of car park and undivided share to the extent of 133 Square yards, bearing Municipal house Nos: 10-5-385/55/C, 10-5-385/55/B, 10-5-385/55/D, 10-5-391/50/B, 10-5-391/10/A, 10-5-391/10/1/D, 10-5-391/10/1/E, 10-5-385/55/E, 10-5-385/35/A, 10-5-385/ 3/A, 10-5-390/8/4, 10-5-3941/5/3, 10-5-391/ 5/4, 10-5-391/5/4/A and 10-5-391/54/1, Situated at Survey No: 129/77, T.S. No: 26, Block-K, Ward No: 12 of Syed Nagar, First Lance, Hyderabad and bounded by:-
NORTH : Corridor and Entrance;
SOUTH : Open to sky;
EAST : Open to sky;
WEST : Open to sky.

K.P. SARADHI, Advocate
OFF.: Flat No.102, 1st floor, Temple View Residency, Opp. Bata Show Room, Beside Lane of Auto Go Gas Station, Lakdikapul, Hyderabad-004, Cell No.9246374879, Office No. 8639973528. saradhikatamaneni@yahoo.com



**NOTICE**
**IN THE COURT OF THE HON'BLE I ADDL. SENIOR CIVIL JUDGE, MEDCHAL MALKAJGIRI DISTRICT AT MALKAJGIRI**
**I.A.No. 697 OF 2016 IN O.S.No. 431 of 2014**

Between:
T.V.S.R. Prasad ...Petitioner/Plaintiff
AND
K. Rama Chandra Sekhar Reddy (Died per LR's) & another ...Respondent/Defendants

To,
1. Smt. Shanthi W/o K.Rama Chandra Sekhar Reddy, Aged about: 50 Yrs, R/o H.No.10-240, Phase-II, E.C.Nagar, HCL Post, Hyderabad-51.
2. K. Sony D/o K.Rama Chandra Sekhar Reddy, Aged about: 23 Yrs, R/o H.No.10-240, Phase-II, E.C.Nagar, HCL Post, Hyderabad-51.
3. K. Sanghvi D/o K.Rama Chandra Sekhar Reddy, Aged about: 23 Yrs, R/o H.No.10-240, Phase-II, E.C.Nagar, HCL Post, Hyderabad-51.

Please take notice that the above suit was filed for Specific Performance and Recovery of Possession in respect of Plot No.31, admeasuring 200 Sq.Yards or 167.2 Sq.Meters in Sy.No.393, situated at Rampally Village & Grampanchayat, Keesara Mandal, R.R.District, where in you No.1 to 3 being the legal heirs of late K.Rama Chandra Shekar Reddy as made as respondents in I.A.No.697 of 2016 and many times notices were sent to you and the same are returned unserved, Hence you No.1 to 3 are hereby informed that the matter is posted on 18.09.2023 for you notice, as such you may approach the above mentioned Hon'ble Court on above mentioned date through your counsel or in person failing with the matter will be decided as per law.

(BY ORDER OF THE HON'BLE COURT)
P. CHANDRASEKHAR
J. SRINIVAS YADAV
Advocates
Office at: Flat No.G-1, Laxmi Residency, Barkatpura, Hyderabad. (M) 9848933667.



**IN THE COURT OF THE HON'BLE IV ADDL. DISTRICT JUDGE, RANGA REDDY DISTRICT AT: L.B. NAGAR**
**OS NO. 360 OF 2016**

BETWEEN:
SAMA NARAYANA REDDY & OTHERS ...PLAINTIFF
AND
DR N.V.RAM KISHORE AND OTHERS ...DEFENDANTS

TO
21. SMT. PANNALA LALITHA, W/O. NARASIMHA REDDY, AGED 46 YEARS, OCC- HOUSE WIFE. R/O. RAGANNAGUDA VILLAGE, TURKA YAMZAL, HAYATH NAGAR MANDAL, RANGA REDDY DISTRICT. (DEFENDANT NO.21)

Sir,
Whereas the Plaintiff has filed the above suit seeking Declaration and Perpetual Injunction against the Defendants. The Hon'ble Court posted the matter on 04-09-2023 at 10-30 AM for your appearance. Therefore, you are requested to appear before the Hon'ble IV Additional District Judge, Ranga Reddy District, L.B.Nagar on 04-09-2023 at 10-30 a.m. either in person or through Counsel duly instructed. Otherwise the matter will be heard and decided exparte in your absence.

("BY ORDER OF THE COURT")
V. RANGA REDDY
Advocate
(COUNSEL FOR THE PLAINTIFF)
H.No.11-8-148 (Plot No.33 & 34) Vikas Nagar, Saroomagar, Hyderabad - 500 035.



**IN THE COURT OF THE HON'BLE I JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT: SECUNDERABAD**
**O.S.No. 683 OF 2023**

Between:
BHOMMANA BOINA VIJAYA LAXMI AND OTHERS ...PLAINTIFFS
AND
TASHILDAR AND ANOTHER ...DEFENDANTS

To,
ALL CONCERNED
Please take notice that the above named plaintiffs filed the above plaint against the Defendants stating that the Plaintiffs are the only legal heirs of Late BHOMMANA BOINA BHASKAR YADAV and they are praying the Hon'ble Court to declare them as Legal Heirs and pass decree in their favour and the above posted on 30.10.2023 at 10.30 A.M. before the Hon'ble Court for your appearance, therefore you are hereby informed to file your objection, if any either in person or through your counsel duly instructed otherwise the above matter will decided according to law.

//BY ORDER OF THE HON'BLE COURT//
Sd/- ANSHUL AGARWAL
Advocate
#1-2-298, Amarnath Kunj, St No.7, Domalguda, Hyderabad-500029. T.S.
Phone No.8801617471.

## ఎల్‌బినగర్ నియోజకవర్గం కాంగ్రెస్ అడ్డా

### కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా మల్‌రెడ్డి రాంరెడ్డి దరఖాస్తు



దరఖాస్తు అందజేయడానికి గాంధీభవన్‌కు చేరుకున్న రామ్‌రెడ్డి తదితరులు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 24 ప్రభాతవార్త:** ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అడ్డా అని ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మల్‌రెడ్డి రామ్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా ఆయన కార్యకర్తలతో భారీ ర్యాలీగా బయలుదేరి గాంధీభవన్‌లో దరఖాస్తు పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి చైతన్యపురి కాంగ్రెస్ కార్యాలయంనుంచి 500ల వాహనాలతో భారీ ర్యాలీగా బయలుదేరారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో దశాబ్దాలుగా పార్టీకోసం, ప్రజలకోసం కృషి చేస్తున్నానని తెలిపారు. రాష్ట్రంలో కేసీఆర్ పాలనతో ప్రజలతో తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఎల్బీనగర్ లో జరుగుతున్న వరుస సంఘటనలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయని, స్థానికంగా ఉన్న ఎమ్మెల్యే, మంత్రి పట్టించుకునే పరిస్థితిలో లేరని విమర్శించారు. అధిష్టానం తనకు తప్పకుండా టికెట్ ఇస్తుందని ఎల్బీనగర్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, బద్దుల వెంకటేష్‌యాదవ్, శ్రీపాల్‌రెడ్డి, సదాశివుడు, బద్దుల వేణుయాదవ్, కిషోర్‌గౌడ్, మంజులారెడ్డి, నర్సింహాయాదవ్, శశిధర్ రెడ్డి, జైపాల్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిఎల్‌ఆర్‌కు హబ్సిగూడ నేతల సంఘీభావం



బిఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డికి సంఘీభావం ప్రకటిస్తున్న సోమిరెడ్డి తదితరులు

**ఉప్పల్, ఆగస్టు 24 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డిని గురువారం హబ్సిగూడ డివిజన్ కార్యదర్శి కంచర్ల సోమిరెడ్డి ఆధ్వర్యంలో పలువురు పార్టీ నేతలతో కలిసి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, సిఎం కెసిఆర్ ఆదేశాల మేరకు పార్టీని మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పార్టీలో ప్రతి ఒక్కరిని కలుపుకుని పోతానని, పార్టీ విజయానికి కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. ఉప్పల్ గడ్డ మీద గులాబీ జెండా ఎగురవేస్తామన్నారు. ఈ సందర్భంగా హబ్సిగూడ డివిజన్ నేతలు సంఘీభావం ప్రకటించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హబ్సిగూడ బిఆర్ఎస్ నేతలు గణేష్, స్వామి, నరేందర్, రాజు, యాకాంతరావు, అంజయ్య, రమేష్, వీరయ్య, డా.రాజు, కనకయ్య, అక్బర్, మహబూబ్, యాదమ్మ, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటు : అడిషనల్ కలెక్టర్



పాలిటెక్నిక్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటనరసింహారెడ్డి తదితరులు

**ఉప్పల్, ఆగస్టు 24 ప్రభాతవార్త :** ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఉప్పల్ నియోజకవర్గం పరిధిలో ఎన్నికల ఈవీఎంల పంపిణి, సేకరణ రామంతాపూర్ పాలిటెక్నిక్ కళాశాల నుంచి జరుగుతుందని జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, ఉప్పల్ తహసీల్దార్ వెంకట నరసింహారెడ్డి,డిసి శ్రీనివాస్, డిప్యూటి తహసీలార్ రఫీ, ఆర్ఐ సుధ, సర్వేయర్ ప్రశాంత్ తదితరులతో కలిసి స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాలలో ఈవిఎంల పంపిణీ, సేకరణ ఇక్కడి నుంచే జరుగుతుందని తెలిపారు. ఈవిఎంలు భద్రపరించేందుకు తగు ఏర్పాట్లు చేయాలని కోరారు. స్ట్రాంగ్ రూమ్ సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## కమ్యూనిటీ వాల్ పనులకు శంకుస్థాపన



కమ్యూనిటీ వాల్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఐలయ్య తదితరులు

**తుర్కయంజాల్, ఆగస్టు 24 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ 22వవార్డు కమ్మగూడ ఇంద్రమ్మ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రామ్‌రెడ్డి సహాయ సహకారంతో రూ 5 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. అనంతరం కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోసికే ఐలయ్య కాలనీవాసులతో కలిసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ కాలనీల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో హనుమంతుగౌడ్, రాజునాయక్, అజయ్‌గౌడ్, శ్రీనివాస్‌నాయక్, ఉపేందర్, సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల సంక్షేమంకోసం ప్రభుత్వం కృషి



బీసీ బంధు చెక్కులు పొందిన లబ్ధిదారులతో కౌన్సిలర్ విద్యావతి విజేందర్‌రెడ్డి

**హయత్‌నగర్, ఆగస్టు 24 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి చర్యలు తీసుకుంటోందని పెద్దఅంబర్‌పేట 4వ వార్డు కౌన్సిలర్ వద్దేపల్లి విద్యావతి విజేందర్‌రెడ్డి అన్నారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ 4వ వార్డుకు చెందిన కాకర్ల శివ, మాద్గుల సంధ్య, నిర్మల, రాజు, మల్లేష్, శివ, నర్సింహారావులకు బీసీ బంధుకింద ప్రభుత్వం లక్ష రూపాయలను మంజూరు చేసిన చెక్కులను విద్యావతి వారికి అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రైతులకు రైతుబంధు, వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ఫించన్లు, దళిత, బీసీ బంధును అందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తోందని తెలిపారు.

## బిఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయం



హోంమంత్రికి పూల మొక్కను అందజేస్తున్న సుందర్‌రెడ్డి

**సైదాబాద్, ఆగస్టు 24 ప్రభాతవార్త:** యాకుత్‌పుర బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా సామ సుందర్‌రెడ్డి పేరు ప్రకటించడంతో గురువారం ఆయన హోంమంత్రి మహమూద్ అలీ, చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు రంజిత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం సుందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ మరోసారి ఓట్ల ప్రభంజనం సృష్టిస్తూ భారీ మెజార్టీతో అధికారంలోకి రానుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎస్ సదన్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## దశలవారీగా రోడ్ల నిర్మాణాలు : పారిజాత



రోడ్డు నిర్మాణపు పనులను పరిశీలించి సూచనలు చేస్తున్న మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, ఆగస్టు 24 ప్రభాతవార్త:** దశల వారీగా బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని డివిజన్లలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. రోడ్డు నిర్మాణపు పనులు చేపడుతున్న 7వ డివిజన్ గుర్రంగూడలోని ఆదిత్యనగర్‌లో గురువారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక కార్పొరేటర్ గడ్డం లక్ష్మారెడ్డితో కలిసి రోడ్డు నిర్మాణపు పనులు జరుగునున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనులకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఇఇ వినీల్‌గౌడ్, కాలనీ అధ్యక్షుడు పుట్టగళ్ళ రవీందర్, గడ్డం లింగారెడ్డి, విఘ్నేష్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రజాకార్ల పాలన అంతం చేయడమే బిజెపి లక్ష్యం : ఎమ్మెల్యే రవికుమార్

**ఎల్.బి.నగర్, ఆగస్టు 24 ప్రభాతవార్త:** తెలంగాణవ్యాప్తంగా రానున్న రోజుల్లో రజాకార్ల పాలనను అంతం చేయడమే లక్ష్యమని కర్ణాటక ఎమ్మెల్సీ రవి కుమార్, బిజెపి ఓబీసీ మోర్చ రాష్ట్ర కోశాధికారి చింతల సురేందర్ యాదవ్ పేర్కొన్నారు. కేంద్ర బిజెపి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ ప్రవాస్ యేజన కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథిగా కర్ణాటక ఎమ్మెల్సీ రవి కుమార్, నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సమావేశమై సంస్థాగతంగా బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేసే అంశాలు, స్థానిక సమస్యలు, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో నిర్వహించాల్సిన పాత్రపై చర్చ జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో ఎల్బీనగర్ గడ్డపై కాషాయజెండా ఎగరవేయడమే కార్యకర్తల కర్తవ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ బిజెపికన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, సతీష్, బద్దం బాలకృష్ణ గౌడ్, పాల్వాయి సంజీవ రెడ్డి, వస్పారీ మల్లేష్, డప్పు రాజు, దశరథ సాగర్, పద్మరెడ్డి, లయ, రాధిక, రాజేశ్వర్, వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో డివిజన్ ప్రజల ఇక్కట్లు : కార్పొరేటర్ రంగా నరసింహగుప్త

**ఎల్.బి.నగర్, ఆగస్టు 24 ప్రభాతవార్త:** డివిజన్‌లో ఉన్న విద్యుత్ సమస్యలు పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చైతన్యపురి డివిజన్ కార్పొరేటర్ రంగా నరసింహగుప్త పేర్కొన్నారు. జిహెచ్ఎంసి కౌన్సిల్ సమావేశంలో ఆయన స్థానిక సమస్యలను మేయర్ దృష్టికి తీసుకువెళ్లారు. విద్యుత్ స్తంభాలు కావాలంటే, వీధి దీపాలు వెలగడం లేదని, విద్యుత్ సమస్యలకు సంబంధించి శాఖ అధికారులతో మాట్లాడితే కాలయాపన చేస్తున్నారే తప్ప పనులు చేయడం లేదని మేయర్ దృష్టికి తీసుకువెళ్లారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా డివిజన్ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు.

## ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడిగా మిద్దెల

**సైదాబాద్, ఆగస్టు 24 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడిగా ఎల్బినగర్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు మిద్దెల జితేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు సేవాదళ్ చీఫ్ ఆర్గనైజర్ లాల్జీ దేశాయ్ ఉత్తర్వులను జారీ చేశారు. జితేందర్ గతంలో టిపిసిసి కార్యదర్శిగా, ఐఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. స్టేట్ కేబుల్ టివి ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా, బిసిఎన్ ఛానల్ గ్రూప్స్ ఛైర్మన్‌గా, ఎల్బినగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎన్నికల ఇంఛార్జిగా ప్రస్తుతం కొనసాగుతున్నారు. గత 40సంవత్సరాలుగా కార్మిక నాయకుడిగా ఉన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తా : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, ఆగస్టు 24 ప్రభాతవార్త:** పారిశుద్ధ్య కార్మికుల సమస్యను ప్రభుత్వందృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. తమను పర్మినెంటు చేయాలని సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయం వద్ద విధులు బహిష్కరించి నిరసన చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులతో ఎమ్మెల్యే మాట్లాడారు. గతంలో మీరు అడగకుండానే వేతనాలు పెంచిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని తెలిపారు. తప్పకుండా మీ డిమాండ్లను ప్రభుత్వందృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని, విధుల్లో చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మాజీ కార్పొరేటర్ భవానిప్రవీణ్‌కుమార్, డివిజన్ అధ్యక్షులు శ్రీశైలంయాదవ్, రమేష్‌ముదిరాజ్, ఆనంద్‌గౌడ్, గండి సన్నీ, రమణారెడ్డి, బాలగౌడ్, వీక్కీ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ టిక్కెట్ ఆశిస్తూ యెల్మేటి దరఖాస్తు

**సరూర్‌నగర్, ఆగస్టు 24 ప్రభాతవార్త:** మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం నుండి కాంగ్రెస్‌అభ్యర్థిగా పోటీ చేయడానికి టిక్కెట్‌ను ఆశిస్తూ పార్టీ సీనియర్ నాయకుడు, టిపిసిసి కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డి పార్టీ అధిష్టానవరానికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు ఆయన పార్టీకి చెందిన పలువురితో కలిసి గాంధీభవన్‌కు తరలివెళ్ళి తన దరఖాస్తును పార్టీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ టి.కుమార్‌రావుకు అందజేశారు. పార్టీ ప్రధాన కార్యదర్శులు అల్లం భాస్కర్,బొల్లు కిషన్, నాగేశ్ ముదిరాజ్, కార్యదర్శులు శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి తదితరుల సమక్షంలో ఆయన తన దరఖాస్తు పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అమ్మద్ బామ్, సీనియర్ నాయకుడు వంగేటి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

## మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ కోసం చల్లా నర్సింహ్మారెడ్డి దరఖాస్తు

**సరూర్‌నగర్, ఆగస్టు 24 ప్రభావార్త:** మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గ టిక్కెట్‌ను ఆశిస్తూ రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి పార్టీ అధిష్టానవర్గానికి దరఖాస్తు చేశారు. నియోజకవర్గం నుండి తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాల్సిందిగా ఆయన తన దరఖాస్తును గాంధీభవన్‌లో పార్టీ ప్రతినిధి భాస్కర్‌కు అందజేశారు. నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన గాంధీభవన్‌కు తరలివెళ్ళి దరఖాస్తు పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో చల్లా ప్రభాకర్‌రెడ్డి, చల్లా శ్రీనివాస్ రెడ్డి, చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, ఆల శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు పలువురు ఉన్నారు.

## డివిజన్లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



మార్నింగ్ వాక్‌లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితోపాటు కాలనీవాసులు

**వనస్థలిపురం, ఆగస్టు 24 ప్రభాతవార్త:** మార్నింగ్‌వాక్‌లో భాగంగా ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, బిఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని సచివాలయ నగర్ హెచ్.ఎం.డి.ఎ. పార్క్‌లో అధికారులు, వాకర్స్‌చే కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా పార్క్‌లో నూతనంగా నిర్మించిన ఓపెన్ జిమ్ ఏర్పాటుతో ఆయనకు అభినందనలు తెలిపారు. అలాగే పలుసమస్యలను వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు స్పందించిన ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలు ఆడుకోవడానికి వసతులు కల్పించడంతోపాటు పార్క్ వెనుక ఉన్న స్థలంలో పిచ్చిమొక్కలు తీసివేసి యోగ షెడ్డు నిర్మిస్తామని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ప్రధాన సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. శివారు ప్రాంతాల్లో ఉన్న ప్రతి ఒక్క ఇంటికి మంచినీరు అందిస్తామన్నారు. నియోజక వర్గాన్ని అభివృద్ధి విషయంలో రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ భారాస అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, అనిల్ చౌదరి, శ్రీధర్‌గౌడ్, సామ బుచ్చిరెడ్డి, పోగుల రాంబాబు, కాజా శ్రీనివాస్, జిహెచ్ఎంసీ డిఇ దామోదర్, హెచ్ఎండిఎ ఎఇ జీవన్, హార్టికల్చర్ ఎఇ మేధా, సీనియర్ సిటీజన్లు, యువత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## భాగ్యనగర్‌లో 120 మంది రైతులకు రూ.75 లక్షల రుణమాఫీ : ఛైర్మన్ నర్సింహారెడ్డి

**సరూర్‌నగర్, ఆగస్టు 24 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రూ.లక్ష లోపు రుణాలకు సంబంధించిన మాఫీ పథకం భాగ్యనగర్ రైతు సేవా సహకార సంఘంలోని 120 మంది రైతులకు వర్తించిందనీ ఈ మేరకు రూ.75 లక్షల రుణమాఫీ అయ్యిందని సొసైటీ ఛైర్మన్ మద్రి నర్సింహారెడ్డి తెలిపారు. రూ.లక్ష లోపు రుణాలు ఉన్న రైతులకు రుణమాఫీ అమలు అవుతున్న నేపథ్యంలో నాదర్‌గుల్‌లోని భాగ్యనగర్ సొసైటీ కార్యాలయంలో ఛైర్మన్ నర్సింహారెడ్డి అధ్యక్షతన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ రుణమాఫీపై పాలకవర్గంతో కలిసి చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు రుణమాఫీ చేస్తున్నందుకు ఆయన భాగ్యనగర్ సొసైటీ, రైతుల తరపున సిఎం కెసిఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ బంగారు బాబు, డైరెక్టర్లు పెత్తుల్ల పుల్లారెడ్డి, యెల్చల సుదర్శన్‌రెడ్డి, చిగిరింత శ్రీరాంరెడ్డి, చప్పిడి కొండల్‌రెడ్డి, మేనేజర్ పిండి నారాయణరెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

## త్వరలో బైరామల్‌గూడ ఫ్లైఓవర్ పనులు పూర్తి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**సైదాబాద్, ఆగస్టు 24 ప్రభాతవార్త:** త్వరలోనే బైరామల్‌గూడ ఫ్లైఓవర్ పనులు పూర్తికానున్నాయని ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చంపాపేటడివిజన్ దుర్గాభవానినగర్‌లో రూ.45 లక్షలతో చేపడుతున్న వరద నీటి పైపులైన్ పనులకు, ఎస్‌వి కాలనీలో రూ.29లక్షలతో చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు శుభోదయ కాలనీలో రూ.89లక్షలతో నిర్మించిన కమ్యూనిటీహాల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంక్షన్‌లకు అనుసంధానమై ఉన్న సర్వీసు రోడ్లను విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇ సురేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, ఎస్‌వికాలనీ అధ్యక్షుడు కేశవరెడ్డి, సభ్యులు దిలీప్‌రెడ్డి, రమాకాంత్, రామకృష్ణ, సుధాకర్‌రెడ్డి, శుభోదయ కాలనీవాసులు నరేష్, గౌరిదేవిరాజు, వెంకటేష్, చందర్, మురళి, బిఆర్ఎస్ నాయకులు నల్ల రఘుమారెడ్డి, రవి ముదిరాజ్, ముద్ద కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు బాసటగా వైఆర్‌పి ఫౌండేషన్





విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న రవిప్రసాద్

**ఎల్.బి.నగర్, ఆగస్టు 24 ప్రభాతవార్త:** ఆర్థిక ఇబ్బందులతో అద్భుత ప్రతిభ కలిగిన విద్యార్థులు విద్యకు దూరంకాకూడదనే మహోన్నత లక్ష్యంతో వైఆర్‌పి ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసామని ఫౌండేషన్ చైర్మన్ యెలిశాల రవి ప్రసాద్ పేర్కొన్నారు. ఆర్కేపురండివిజన్ వాసవికాలనీలో వైఆర్‌పి ఫౌండేషన్ శాశ్వత కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక, ఆధ్యాత్మిక, పర్యావరణహిత సేవలతో నిరంతరం సమాజ అభివృద్ధిలో వైష్ణవి గ్రూపు ద్వారా భాగస్వామ్యంతో సేవలందిస్తామన్నారు. పేద కుటుంబాల విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసం కోసం ఫీజులు, విద్యతో పాటు క్రీడలు, సంస్కృతి సంప్రదాయాలు, సమాజ సేవకు ఫౌండేషన్ అండగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి కార్పొరేటర్ రంగా నరసింహగుప్తా, మొరిశెట్టి శ్రీనివాస్, టి.నరసింహారావు, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, చకిలం శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కార్పోరేటర్ శాంతిశేఖర్

**నాచారం, ఆగస్టు 24 ప్రభాతవార్త:** వికలాంగులకు ప్రభుత్వం ప్రతి నెల రూ. 4016 పెన్షన్‌ను పెంచిన సందర్భంగా నాచారం వైజయంతి సమీపంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి వికలాంగులు పాలాభిషేకం చేశారు. వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు బూడిద గణేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కార్పోరేటర్ శాంతిశేఖర్ విచ్చేసి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని కోరుకుంటారని ఆయన చేసిన అభివృద్ధి సంక్షేమమే తిరిగి బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వికలాంగులు యాదగిరి, మల్లేష్, నాని, రమేష్, ఉప్పలమ్మ, విద్య, నరేందర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## సామ చేపట్టిన 48 గంటల నిరసన దీక్షకు ఈటెల రాజేందర్ సంఘీభావం



సామ రంగారెడ్డి చేపట్టిన 48 గంటల నిరసన దీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే ఈటెల రాజేందర్, గీతమూర్తి తదితరులు

**మన్సూరాబాద్, ఆగస్టు 24 ప్రభాతవార్త :** నేర రహిత ఎల్‌బినగర్ కోసం 48 గంటల పాటు నిరసన దీక్ష చేపట్టిన బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి దీక్షకు రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, మహిళా మోర్చా అధ్యక్షురాలు గీతమూర్తిలు హాజరై సంఘీభావం తెలుపుతూ నిరసన దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొట్లాడి తెలంగాణ సాధించుకుంటే ఇప్పుడు మహిళల రక్షణకోసం ఇలా టెంట్ వేసుకొని ధర్నాలు చేస్తామని ఊహించలేదన్నారు. మలిదశ ఉద్యమ నాయకుడు శ్రీకాంత చారి తెలంగాణ కోసం మరణిస్తే.. అదే స్థలంలో ఈ పరిస్థితి రావడం దారుణమన్నారు. నిత్యం ప్రజా సంక్షేమం కోసం పోరాడుతుంటే మాపై పోలీసులు నిఘా పెడుతుండడం విడ్డూరమన్నారు. హైదరాబాద్ చుట్టుపక్కల ఎక్కడపడితే అక్కడ మద్యం షాపులు, బెల్ట్ షాపులు, గంజాయి ముఠాలు, చిన్నారులపై , మహిళలపై, అఘాయిత్యాలు పాల్పడుతున్న వారిపై నిఘా పెట్టాలనీ డిమాండ్ చేశారు. లక్ష్మీ అనే గిరిజన మహిళ పై పోలీసుల చేసిన దాడి అమానుషం అన్నారు ప్రజలను కాపాడే పోలీసులే కాలయముడు లాగ ప్రవర్తిస్తున్నారన్నారు. బంగారు తెలంగాణ తెస్తానని చెప్పిన కేసీఆర్ తాగుడు, ఊగుడు తెలంగాణ తెచ్చిందన్నారు. ప్రజలందరూ ఆలోచన చేసి ఈ రజాకార్ ప్రభుత్వాన్ని గద్దె దింపాలన్నారు. ఈ సారి బిఆర్ఎస్ పార్టీకి కర్రు కాల్చి వాత పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి, కళ్లెం రవీందర్‌రెడ్డి, వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రేమ్‌మహేశ్వర్ రెడ్డి, పవన్‌కుమార్, కృష్ణవేణి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మొబైల్ హెల్త్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి : కార్పొరేటర్ మేకల సునీత



మొబైల్ హెల్త్ క్యాంపును ప్రారంభించిన కార్పొరేటర్ సునిత తదితరులు

**మల్కాజిగిరి, ఆగస్టు 24 ప్రభాతవార్త :** గౌతమ్‌నగర్ డివిజన్ మల్లికార్జుననగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్‌లో రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ సిటిజన్స్ కోసం ఏర్పాటు చేసిన మొబైల్ హెల్త్ క్యాంపును డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొబైల్ హెల్త్ క్యాంపును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల రాముయాదవ్, రాష్ట్ర సీనియర్ సిటిజన్ అధ్యక్షుడు నర్సింహారావు, శ్రీనివాస్‌రెడ్డి, అచ్యుత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## బాధితురాలికి పోగొట్టుకున్న పర్సు అందజేత



బాధితురాలికి పర్సును అందజేస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ సుధాకర్‌రెడ్డి

**మలక్‌పేట, ఆగస్టు 24 ప్రభాతవార్త :** పోగొట్టుకున్న పర్సును బాధితురాలికి పర్సును అందజేసిన సంఘటన మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. దిల్‌సుక్‌నగర్ వద్ద విధులు నిర్వహిస్తున్న మలక్‌పేట ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ ఇ.సుధాకర్‌రెడ్డికి రోడ్డు పడి ఉన్న ఓ పర్సు కనిపించింది. పర్సులో రూ.4వేలు, బంగారు కాయిన్, ఎటిఎం, పాన్ కార్డులు ఉండడంతో వెంటనే బాధితురాలికి ఫోన్‌చేసి పర్సు అందజేశారు. బాధితురాలికి పర్సును అందజేసిన హెడ్ కానిస్టేబుల్ ఇ.సుధాకర్‌రెడ్డిని అందరూ అభినందించారు.

## సిఎం కెసిఆర్‌ను కలిసిన కొండ యాదగిరి

**సైదాబాద్, ఆగస్టు 24 ప్రభాతవార్త:** బిసిసంఘం రాష్ట్ర కార్యదర్శి కొండ యాదగిరి ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కెసిఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బిఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటూ కష్టపడే ఉద్యమకారులు, యువతను గుర్తించాలని పార్టీ అధిష్టానాన్ని కోరడం జరిగిందన్నారు.



ముఖ్యమంత్రి కెసిఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన కొండ యాదగిరి

## ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను తీర్చాలి : పిఆర్‌టియు చెన్నకేశవరెడ్డి

**సరూర్‌నగర్, ఆగస్టు 24 ప్రభాతవార్త :** ఉపాధ్యాయులకు సంబంధించిన న్యాయమైన డిమాండ్లను రాష్ట్రప్రభుత్వం తీర్చాలని పిఆర్‌టియు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గుర్రం చెన్నకేశవరెడ్డి కోరారు. సంఘం సభ్యత్వ నమోదు వారోత్సవాల సందర్భంగా గురువారం ఆయన సరూర్‌నగర్, చంపాపేట్, రాజీవ్‌గాంధీ జడ్పీహెచ్ఎస్‌లలో సభ్యత్వ నమోదు కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల పక్షాన నిలిచి వారి సంక్షేమానికి పాటుపడేది పిఆర్‌టియునేనని అన్నారు. ఉపాధ్యాయులు కోరుతున్న పిఆర్‌టియు కమీషన్‌ను ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేసి మధ్యంతర భృతిని ప్రకటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అదే విధంగా వర్క్ అడ్జస్ట్‌మెంట్లు ఆపి రేషనలైజేషన్ చేసి బదిలీలు, పదోన్నతులు చేపట్టాలనీ ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ బిల్లులన్నీ ఆగస్టు లోపు చెల్లించాలని కోరారు. 2003 సిపిఎస్ ఉపాధ్యాయులకు ఓపిఎస్ సాధిస్తామనీ, ఇహెచ్ఎస్ కార్డులు అన్ని ఆసుపత్రుల్లో పక్కాగా అమలయ్యేలా కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. పిఇటి పండిత్ పోస్టులు అప్‌గ్రేడేషన్, బదిలీలు, ప్రమోషన్లు సాధించిపెట్టి 317 జిఓ ద్వారా ఇబ్బందులు పడ్డ ఉపాధ్యాయులు సమస్యలు పరిష్కరిస్తామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్ యాదవ్, గౌరవ అధ్యక్షుడు కొండాయపల్లి నారాయణగౌడ్, ప్రధాన కార్యదర్శి సామల మహేందర్‌రెడ్డిలతో పాటు శాఖ అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నవీన్, గౌరవ అధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్, రాష్ట్ర జిల్లా బాధ్యుడు శ్రీధర్‌రెడ్డి, శరత్‌చంద్ర,రమేష్‌గౌడ్, వేణుగోపాల్, జహంగీర్ పాష, వినయ్, నర్సింహారెడ్డి, సునీత తదితరులు పాల్గొన్నారు.